STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 121 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శనివారం 14 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |



మహిళా కోటాపై కేంద్రం పట్టు

- మరోసారి డీలిమిటేషన్ బిల్లు!
- రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి కేంద్రం కసరత్తు

4



ఒక నగ్న ఫొటోకు.. ఓ యుద్ధ ప్లాన్ లీక్

4

పాక్ గూఢచారితో ఐఏఎఫ్ అధికారి బేరం!

మోదీ నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు

- ప్రధాని ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపణ
- ఆరోపణలకు ఆధారాలు ఫోన్‌లోనే ఉన్నాయని వ్యాఖ్య
- మోదీతో ముఖాముఖి చర్చకు మరోసారి సవాల్
- ఇన్‌స్టాగ్రామ్ ప్రశ్నోత్తరాల్లో రాహుల్ వ్యాఖ్యలు

2

ప్రధాని నరేంద్ర మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తన ఆరోపణలపై ప్రధాని బహిరంగ చర్చకు రావాలని మరోసారి సవాల్ విసిరారు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఎలాంటి ఆధారాలను బహిరంగంగా వెల్లడించలేదు.




పారిశ్రామిక విధానంలో ఏపీ ట్రెండ్ సెట్టర్

రాష్ట్రంలో 9.89 లక్షల కోట్ల పెట్టుబడులు

- క్యూ కట్టిన దిగ్గజ పారిశ్రామిక సంస్థలు
- 303 ప్రతిపాదనల ద్వారా భారీ పెట్టుబడుల ప్రవాహం
- విశాఖ సీఐఐ సదస్సు ముగింపులో సీఎం ప్రసంగం

విశాఖపట్నం, నవంబర్ 13 (సమయం న్యూస్): అత్యంత క్లీన్ సిటీగా నిలిచిన విశాఖపట్నం వేదికగా రెండు రోజుల పాటు జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతంగా ముగిసింది. ముగింపు సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్, థాట్ లీడర్‌షిప్ అనే థీమ్‌తో జరిగిన ఈ సదస్సులో మొత్తం 303 ప్రతిపాదనల ద్వారా ఏకంగా రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చిన మొత్తం 714 ప్రతిపాదనల్లో ఇప్పటికే 522 ప్రతిపాదనలు వాస్తవరూపం దాలుస్తున్నాయని వెల్లడించారు. తాజా

మిగతా 2 లో



విశాఖపట్నం వేదికగా రెండు రోజుల పాటు జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు సమావేశంలో రాష్ట్ర భవిష్యత్తు ముఖచిత్రాన్ని మార్చేసే భారీ పెట్టుబడుల ప్రవాహం గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఈ సదస్సు ద్వారా ఏకంగా 303 ప్రతిపాదనలతో రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, కియా, రిలయన్స్ లాంటి దిగ్గజ సంస్థలు భారీ ప్రాజెక్టులతో ముందుకొచ్చాయని ఆయన వెల్లడించారు. పారిశ్రామికవేత్తల పెట్టుబడులకు భద్రత కల్పించేలా 'ఎస్క్రో ఖాతా', 'ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ చట్టం' లాంటి విప్లవాత్మక సంస్కరణలను అమలు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. కేవలం ఐదు రోజుల్లోనే 13 లైసెన్సులతో ఆటోమేటిక్ అనుమతులు ఇచ్చేలా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని తీసుకొచ్చామని వెల్లడించారు.



ఏపీ స్పీడ్.. మామూలుగా లేదు

ఐదు నెలల్లోనే 22 లక్షల కోట్ల పెట్టుబడులు

- విభజన కష్టాలు దాటి స్వర్ణాంధ్ర దిశగా అడుగులు
- సీఐఐ ముగింపు సదస్సులో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

3

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఏకంగా 22 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడం సాధారణ విషయం కాదని ఆయన ప్రశంసించారు.



ఏరోస్పేస్ ఎకోసిస్టమ్

అంతరిక్ష రంగంలో విడిభాగాల తయారీకి ప్రోత్సాహం

- జువ్వలదిన్నెను మారిటైమ్ ఎగుమతుల కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- స్కిల్లింగ్ సెంటర్ ఏర్పాటుకు సాగర్ డిఫెన్స్ ఫౌండర్‌తో లోకేష్ భేటీ

2



అభివృద్ధి దిశగా రోడ్ల నెట్‌వర్క్

- సీఐఐ సదస్సులో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

.. వివరాలు 2లో

రూ.1,41,585 కోట్లు

ఏపీకి.. పెట్టుబడుల వెల్లువ!

- విశాఖ సీఐఐ సదస్సు రెండో రోజూ భారీ ఎంఓయూలు
- ప్రత్యక్షంగా 10,919 మందికి ఉద్యోగ అవకాశాలు
- సీఎం చంద్రబాబు సమక్షంలో కంపెనీల ఒప్పందాలు

2




ఆత్మహత్యకు మీరే కారణం

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌పై జగన్ ఫైర్

ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుతోనే విద్యార్థుల బలిదానాలు

చిత్తూరు ఇంజినీరింగ్ కాలేజీ ఘటనపై తీవ్ర ఆగ్రహం


2



మొదలైంది.. పంచాయతీ పోరు!

- ఏపీలో తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్
- అధికారికంగా ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

3



ముంచుకొస్తున్న అక్వాన్

- ఏపీకి పొంచి ఉన్న మరో తుఫాన్ ముప్పు
- బంగాళాఖాతంలో ఏర్పడిన తాజా అల్పపీడనం
- పదహారు నాటికి తుఫాన్‌గా మారే అవకాశం
- పద్దెనిమిది, పంతొమ్మిది తేదీల్లో భారీ వర్షాలు
- తెలంగాణలో మూడు రోజులు పొడి వాతావరణం

వివరాలు 2లో..

పర్యాటకానికి పెట్టుబడుల వెల్లువ!



పెట్టుబడిదారులకు భరోసా ఇచ్చిన మంత్రి దుర్గేష్

2



ఏరోస్పేస్ ఎకోసిస్టమ్!

అంతరిక్ష రంగంలో విడిభాగాల తయారీకి ప్రోత్సాహం

జువ్వలదిన్నెను మారిటైమ్ ఎగుమతుల కేంద్రంగా తీర్చిదిద్దుతాం

స్కిల్లింగ్ సెంటర్ ఏర్పాటుకు సాగర్ డిఫెన్స్ ఫౌండర్‌తో లోకేష్ భేటీ

సీఐఐ సదస్సులో స్పేస్ ఎకానమీపై ప్రత్యేక ప్యానల్ చర్చ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్

విశాఖపట్నం, నవంబర్ 13 (సమయం న్యూస్): అంతరిక్ష పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్‌ను నూతన గమ్యస్థానంగా తీర్చిదిద్దడంతో పాటు రాష్ట్రంలో సమగ్ర స్పేస్ ఎకానమీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. అంతరిక్ష రంగానికి అవసరమైన విడిభాగాలు, ఉపవ్యవస్థలను తయారు చేసే ఎంఎస్ఎంఈ సంస్థలన్నింటినీ ఒకే వ్యవస్థలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజు 'కక్ష్య నుంచి అవకాశాల దిశగా: భారతదేశ నూతన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ' అంశంపై నిర్వహించిన ప్రత్యేక చర్చలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంతరిక్ష రంగంలో రాష్ట్ర ప్రభుత్వం పోషించాల్సిన పాత్ర, స్టార్టప్‌ల అభివృద్ధిపై ఆయన మాట్లాడారు. అంతరిక్ష రంగంలో స్మైరూట్ లాంటి సంస్థలకు అవసరమైన విడిభాగాలను తయారు చేసే సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను ఒకే ఎకోసిస్టమ్‌లోకి తీసుకురావడమే వర్టికల్ ఇంటిగ్రేషన్ లక్ష్యమన్నారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు కలిసి పనిచేసేలా హారిజాంటల్ ఇంటిగ్రేషన్‌ను ప్రోత్సహిస్తామని చెప్పారు. తిరుపతి ఐఐటీతో కలిసి ఇంధన రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న ప్రత్యేకత పనులను వేగంగా పూర్తి చేయడమేనని.. ఇక్కడ డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉందని లోకేష్ వ్యాఖ్యానించారు. ఏపీ స్పేస్ పాలసీ-4.0, ప్రతిపాదిత తిరుపతి స్పేస్ సిటీ ద్వారా రాష్ట్రాన్ని ఏరోస్పేస్ ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ సీఈవో రోహన్ గణపతి మోడరేటర్‌గా వ్యవహరించిన ఈ సెషన్‌లో ఇస్రో ఎయిర్ కమోడోర్ ప్రశాంత్ బి.నాయర్, అగ్నికుల్ సీఈవో శ్రీనాథ్ రవిచంద్రన్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, గెలాక్స్‌ఐ సీఈవో సుయాష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్స్ స్కిల్లింగ్ సెంటర్ కోసం భేటీ..

ఆంధ్రప్రదేశ్‌ను సముద్ర సాంకేతికత, రక్షణ రంగంలో కీలక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా జువ్వలదిన్నెను ఇండో-పసిఫిక్ ప్రాంతానికి మారిటైమ్ రోబోటిక్స్ ఎగుమతుల కేంద్రంగా తీర్చిదిద్దాలని మంత్రి లోకేష్ ప్రతిపాదించారు. సదస్సులో భాగంగా సాగర్ డిఫెన్స్ ఫౌండర్ కెప్టెన్ నికుంజ్ పరాశర్‌తో మంత్రి భేటీ అయ్యారు. ఐఐటీ తిరుపతి, ఆంధ్రా యూనివర్సిటీ మెరైన్ ఇంజనీరింగ్ విభాగం భాగస్వామ్యంతో మారిటైమ్ అటానమీ, రోబోటిక్స్ స్కిల్లింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. కోస్ట్ గార్డ్ అవసరాలకు అనుగుణంగా మానవరహిత నౌకల సముద్ర పరీక్షలకు జువ్వలదిన్నెను అనువైన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. ఏపీ మారిటైమ్ బోర్డు పరిధిలోని పోర్టుల్లో హార్బర్ భద్రత, హైడ్రోగ్రాఫిక్ సర్వేల కోసం మానవరహిత ఉపరితల నౌకల పైలట్ ప్రాజెక్టులు చేపట్టాలని సూచించారు. జువ్వలదిన్నె పరిసర ప్రాంతాల మత్స్యకార కుటుంబాలకు ప్రాధాన్యతనిస్తూ స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన అవకాశాలను పరిశీలించి, తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని సాగర్ డిఫెన్స్ ప్రతినిధి పరాశర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

మోదీ నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు

ప్రధాని ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపణ

ఆరోపణలకు ఆధారాలు ఫోన్‌లోనే ఉన్నాయని వ్యాఖ్య

మోదీతో ముఖాముఖి చర్చకు మరోసారి సవాల్

ఇన్‌స్టాగ్రామ్ ప్రశ్నోత్తరాల్లో రాహుల్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, నవంబర్ 13 (సమయం న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తన ఆరోపణలపై ప్రధాని బహిరంగ చర్చకు రావాలని మరోసారి సవాల్ విసిరారు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఎలాంటి ఆధారాలను బహిరంగంగా వెల్లడించలేదు. విదేశీ శక్తుల నియంత్రణలో ప్రధాని మోదీ ఉన్నారంటూ గతంలో చేసిన ఆరోపణలకు ఆధారాలేమిటని ఓ వ్యక్తి ప్రశ్నించగా.. తన ఫోన్‌ను చూపిస్తూ అందులోనే ఆధారాలున్నాయని రాహుల్ పేర్కొన్నారు. తన ఫోన్ ట్యాప్ అవుతున్న విషయం ప్రధానికి తెలుసని వ్యాఖ్యానించారు. మోదీ చర్చకు వస్తే ఎవరు విదేశీ శక్తుల ప్రభావంలో ఉన్నారు? ఎవరు దేశ వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు? అనే అంశాలతో పాటు తనకు తెలిసిన పలు విషయాలు బయటపడతాయని అన్నారు. ప్రధానితో ముఖాముఖి చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని రాహుల్ స్పష్టం చేశారు. గతంలోనూ పలు సందర్భాల్లో బహిరంగ చర్చకు రావాలని మోదీకి సవాల్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తాజా ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు రాజకీయంగా చర్చకు దారితీశాయి.

రూ.1,41,585 కోట్లు



- ఏపీకి.. పెట్టుబడుల వెల్లువ!
- సీఐఐ సదస్సు రెండో రోజూ భారీ ఎంఓయూలు
- 10,919 మందికి ఉద్యోగ అవకాశాలు
- సీఎం సమక్షంలో కంపెనీల ఒప్పందాలు

విశాఖపట్నం, నవంబర్ 13 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడుల వెల్లువ కొనసాగుతోంది. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో వివిధ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో భారీ పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. మొత్తం 11 అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు), ఒక జీవో జారీ ద్వారా రూ.1,41,585 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. వీటి ద్వారా 10,919 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మైనింగ్, అంతరిక్ష పరిశోధనలు, ఏరోస్పేస్, రక్షణ, పునరుత్పాదక ఇంధనం, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, పోర్టులు, పర్యాటక రంగాల్లో కంపెనీలు పెట్టుబడులకు ముందుకొచ్చాయి. ప్రకాశం జిల్లా కందుకూరులో మైనింగ్ కార్యకలాపాల కోసం హిందాల్కో గ్రూప్ రూ.15 వేల కోట్లతో ఒప్పందం చేసుకుంది. తిరుపతి జిల్లాలో ఆర్బిటల్ డేటా సెంటర్, రాకెట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అగ్నికుల్ కాస్మోస్ రూ.510 కోట్లు, ఏరోస్పేస్ రంగంలో హాథోర్ రాకెట్ సంస్థ రూ.250 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. పునరుత్పాదక ఇంధన రంగంలో గ్రీన్ జెన్ రెన్యూవబుల్ ఎనర్జీ సంస్థ రూ.8 వేల కోట్లు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రూ.6,600 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నాయి. ఇక ఐటీ విభాగంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఎయిర్‌ట్రంక్ ఇండియాఉజేసీకే ఇన్‌ఫ్రా ఏకంగా రూ.1,03,018 కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ క్యాంపస్, టెలికాం కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాయి. డిక్సన్ టెక్నాలజీస్ రూ.700 కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్టు చేపట్టనుంది. కాకినాడలో మెకనైజ్డ్ బెర్త్, షిప్ బిల్డింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్ రూ.6,452 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. పర్యాటక రంగంలో ఒబెరాయ్ గ్రూప్ రూ.175 కోట్ల పెట్టుబడిగా పెట్టనుంది.

పీ4 కింద పదిహేను వందల మందికి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీ4 కార్యక్రమానికి సంబంధించి సీఐఐ సదస్సులో మరో రెండు కీలక ఒప్పందాలు కుదిరాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించేందుకు హీరో మోటార్ కార్పొరేషన్‌తో స్వర్ణాంధ్ర ఫౌండేషన్ ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం రూ.32.48 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వంద గ్రామాల్లోని 25 వేల బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఐటీసీ లిమిటెడ్‌తో స్వర్ణాంధ్ర ఫౌండేషన్ మరో ఒప్పందం కుదుర్చుకుంది.

పారిశ్రామిక విధానంలో ఏపీ ట్రెండ్ సెట్టర్

(మొదటి పేజీ తరువాయి..)

ఒప్పందాల ద్వారా తయారీ రంగం, ఫుడ్ ప్రాసెసింగ్, విద్య, వైద్యం, ఏవియేషన్, ఆటోమొబైల్ లాంటి రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చాయన్నారు. కియా మోటార్స్ సంస్థ ఏడాదికి మరో రెండు లక్షల కార్లను అదనంగా తయారు చేసేందుకు రూ.18,800 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిందని సీఎం వెల్లడించారు. అలాగే రిలయన్స్ సంస్థ రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలతో ఒప్పందం చేసుకుందని తెలిపారు. కేవలం పెట్టుబడుల ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా, ప్రాజెక్టులను త్వరితగతిన కార్యరూపంలోకి తీసుకురావాలని పారిశ్రామికవేత్తలకు ఆయన సూచించారు. ప్రాజెక్టుల గ్రౌండింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం టెక్నాలజీ, ఏరోస్పేస్, స్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడుల కోసం తిరుపతి సమీపంలో ఏకంగా ఐదు వేల ఎకరాలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. దేశంలోని ఐఐటీలు ఏపీని పరిశోధనలకు ప్రయోగశాలగా మార్చుకుని నూతన ఆవిష్కరణలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వన్ ఫ్యామిలీ-వన్ ఏఐ విధానం ద్వారా నిపుణులను తయారు చేస్తామని, ఏపీ ఒక్కటే 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి వివరించారు.



పారిశ్రామిక విధానంలో ట్రెండ్ సెట్టర్..

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనను మరింత సులభతరం చేసేందుకు నాలా చట్టాన్ని రద్దు చేశామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా కేవలం 13 లైసెన్సులతో 5 రోజుల్లోనే అన్ని రకాల అనుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. ఆటోమేటిక్ అప్రూవల్స్, సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానాలను తీసుకొచ్చామని, ఏ ప్రాజెక్టుకైనా నిర్దేశిత గడువులోగా అనుమతులు ఇచ్చేలా కఠిన నిబంధనలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎప్పటికప్పుడు అందించేందుకు వీలుగా నిన్నటి నుంచే 'ఎస్క్రో ఖాతా' విధానం అమల్లోకి వచ్చిందని, ఇది పారిశ్రామిక సంస్కరణల్లో ఒక ట్రెండ్ సెట్టర్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. పెట్టుబడుల రక్షణ కోసం త్వరలోనే 'ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ చట్టం' కూడా తెస్తామన్నారు. ఈ చట్టం దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తే భారతదేశానికి పెట్టుబడుల ప్రవాహం వస్తుందని, ఈ సంస్కరణ దిశగా అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. పెట్టుబడుల ద్వారా సంపద సృష్టించడంతో పాటు ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన జీవన ప్రమాణాలు కల్పించడమే తమ లక్ష్యమని సీఎం ఉద్ఘాటించారు. పీ4 కార్యక్రమంలో భాగంగా 25 వేల బంగారు కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు పారిశ్రామిక సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. టీవీఎస్ సంస్థ ఆర్థిక సాయంతో కుప్పంలో ఇటుక బట్టీ కార్మికురాలు నేడు మరో ఇరవై మందికి ఉపాధి కల్పిస్తున్న యజమానిగా ఎదగడం ఎంతో స్ఫూర్తిదాయకమని సీఎం ప్రశంసించారు. ప్రతి కుటుంబం సంతోషంగా, ఆరోగ్యంగా, ఆర్థికంగా బలంగా ఉండాలన్నదే తన నిరంతర తాపత్రయమని ఆయన స్పష్టం చేశారు.

అభివృద్ధి దిశగా రోడ్ల నెట్‌వర్క్

అమరావతి ఔటర్ రింగ్ రోడ్డుకు త్వరలో ఆమోదం

పోర్టులకు అనుసంధానంగా భారీ బైపాస్ రహదారులు

సీఐఐ సదస్సులో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

విశాఖపట్నం, నవంబర్ 13 (సమయం న్యూస్): వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ప్రపంచస్థాయి రహదారి మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి ఏకంగా మూడు లక్షల కోట్ల విలువైన రహదారి ప్రాజెక్టులను చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నాణ్యమైన రహదారుల నిర్మాణం వల్ల దేశంలో జీడీపీలో 16 శాతంగా ఉన్న లాజిస్టిక్స్ వ్యయం ప్రస్తుతం తొమ్మిది శాతానికి తగ్గిందన్నారు. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తుల పోటీతత్వం పెరుగుతుందని చెప్పారు. 2014లో ఏపీలో 4,100 కిలోమీటర్లుగా ఉన్న జాతీయ రహదారుల నెట్‌వర్క్ 2026 నాటికి 8,700 కిలోమీటర్లకు చేరిందని గడ్కరీ వివరించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు అరవై వేల కోట్లతో 4,750 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం లక్ష కోట్లతో 2,500 కిలోమీటర్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలో మరో 1.20 లక్షల కోట్లతో 4,600 కిలోమీటర్ల మేర పనులు ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రయాణ దూరం గణనీయంగా తగ్గనుందని, సూరత్-చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే ద్వారా 31 గంటల ప్రయాణం 17 గంటలకు తగ్గుతుందని చెప్పారు. బెంగళూరు-కడప-విజయవాడ కారిడార్‌తో ప్రయాణ సమయం పన్నెండు గంటల నుంచి నాలుగు గంటలకు తగ్గుతుందన్నారు.



పోర్టులకు జాతీయ రహదారుల అనుసంధానం..

హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం మధ్య రూ.12 వేల కోట్లతో 286 కిలోమీటర్ల ఆరు వరుసల రహదారి విస్తరణ చేపడుతున్నట్లు గడ్కరీ తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు రెండున్నర గంటల్లో, విజయవాడ నుంచి మచిలీపట్నానికి గంటలోపు చేరుకునేలా రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఖరగ్‌పూర్-విశాఖపట్నం-అమరావతి కారిడార్‌ను రూ.71 వేల కోట్లతో నిర్మించనున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాలను అనుసంధానిస్తూ రూ.32 వేల కోట్లతో 195 కిలోమీటర్ల మేర అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి త్వరలోనే కేంద్ర మంత్రివర్గ ఆమోదం లభించనుందని గడ్కరీ వెల్లడించారు. విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం పోర్టులను జాతీయ రహదారులతో అనుసంధానించేందుకు వేల కోట్ల రూపాయలతో ప్రాజెక్టులు చేపడుతున్నట్లు వివరించారు. ఏటా 22 లక్షల కోట్ల విలువైన ఇంధనాల దిగుమతులను తగ్గించేందుకు ఎలక్ట్రిక్, ఇథనాల్, బయోడీజిల్ లాంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను ప్రోత్సహిస్తున్నామన్నారు. పంటలతో పాటు బయోమాస్ నుంచి సీఎన్‌జీ ఉత్పత్తి చేస్తూ రైతులు ఇంధనదాతలుగా ఎదుగుతున్నారని ఆయన ప్రశంసించారు. ఎన్హెచ్ఏఐ బాండ్లలో పెట్టుబడుల ద్వారా 8.5 శాతం నుంచి 18 శాతం వరకు రాబడి పొందే అవకాశాలున్నాయని మంత్రి వివరించారు.

పర్యాటకానికి పెట్టుబడుల వెల్లువ!

ఏపీ టూరిజం సెక్టార్‌లో 62 కొత్త ప్రాజెక్టులు

రాష్ట్రానికి రూ.7,287 కోట్ల భారీ పెట్టుబడులు

సీఐఐ సదస్సులో 860 కోట్లతో పది ఎంఓయూలు

పెట్టుబడిదారులకు భరోసా ఇచ్చిన మంత్రి దుర్గేష్

46 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు

విభిన్న పర్యాటకానికి కేరాఫ్ అడ్రస్ ఆంధ్రప్రదేశ్



విశాఖపట్నం, నవంబర్ 13 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచస్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. భవిష్యత్తు అంతా పర్యాటక రంగానిదేనని, ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజు పర్యాటక రంగంలో పెట్టుబడులు, అవకాశాలపై ఆయన ప్రసంగించారు. పెట్టుబడిదారులను 'ఫ్రెండ్స్' అని సంబోధించిన మంత్రి.. రాష్ట్రంలో పెట్టుబడులకు రక్షణ, ప్రోత్సాహకాల బాధ్యత ప్రభుత్వానిదేనని భరోసా ఇచ్చారు. ప్రపంచ పటంలో ఏపీని ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా నిలబెట్టే ప్రయత్నంలో పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని కోరారు. ఇతర ప్రాంతాల్లో పర్యాటకులకు కేవలం జ్ఞాపకాలు మాత్రమే మిగిలితే, ఏపీలో ఆప్యాయత, గౌరవం కూడా లభిస్తాయని పేర్కొన్నారు. భారతదేశంలోని విభిన్న పర్యాటక అనుభూతులను ఒక్కచోట చూడాలంటే ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిందేనని మంత్రి ఉద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఐదు ప్రాంతీయ సదస్సుల ద్వారా 50 ప్రాజెక్టులు, తాజా సీఐఐ సదస్సు ద్వారా మరో 12 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరినట్లు మంత్రి వివరించారు. మొత్తంగా 62 ప్రాజెక్టుల ద్వారా రూ.7,287.30 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయని వెల్లడించారు.

కొత్తగా 5 వేల హోటల్ గదులు..

సీఐఐ సదస్సు రెండో రోజు పర్యాటక రంగంలో రూ.860 కోట్ల విలువైన పది ప్రాజెక్టులకు ఎంఓయూలు కుదిరాయి. మరో రూ.336 కోట్ల విలువైన రెండు ప్రాజెక్టులకు సంబంధించిన జీవోలను ప్రభుత్వం అందించింది. కుప్పం, కర్నూలు, విజయనగరం, రాజమహేంద్రవరం, విశాఖపట్నం లాంటి ప్రాంతాల్లో హోటళ్లు, రిసార్టులు, కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటుకు ఈ ఒప్పందాలు దోహదపడనున్నాయి. తిరుపతిలో హోటల్స్ నిర్మాణం కోసం ఆర్కే2 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డైవిక్ సంస్థలతో జీవోల మార్పిడి జరిగింది. తాజా ప్రాజెక్టుల ద్వారా కొత్తగా 5 వేలకు పైగా హోటల్ గదులు అందుబాటులోకి రావడంతో పాటు 46,853 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. సుదీర్ఘ సముద్రతీరం, అరకు లోయ, లంబసింగి, గండికోట, కోనసీమ, బౌద్ధ ఆరామాలతో ఏపీ అద్భుతమైన పర్యాటక కేంద్రంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, కార్యదర్శి ఆమ్రపాలి కాట, టూరిజం ఎండీ పట్టాన్‌శెట్టి రవి సుభాష్ తదితరులు పాల్గొన్నారు. పెట్టుబడిదారులకు కొత్త పర్యాటక పాలసీలోని రాయితీలు, అవకాశాలను వారు వివరించారు.

ఏపీ స్పీడ్.. మామూలుగా లేదు!

- ఐదు నెలల్లోనే 22 లక్షల కోట్ల పెట్టుబడులు
- విభజన కష్టాలు దాటి స్వర్ణాంధ్ర దిశగా అడుగులు
- సీఎం చంద్రబాబు ఆత్మవిశ్వాసం అభినందనీయం
- సీఐఐ ముగింపు సదస్సులో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- కలిసి పనిచేద్దాం.. సంపదను పంచుదామన్న పిలుపు



విశాఖపట్నం, నవంబర్ 13 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రం ఏకంగా 22 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడం సాధారణ విషయం కాదని ఆయన ప్రశంసించారు. విశాఖపట్నంలో జరిగిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా స్వర్ణాంధ్ర సాధన దిశగా ఏపీ అడుగులు వేస్తోందని ఆయన తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలతో పాటు పలు రంగాల అభివృద్ధిపై మేధోమథనం జరిగిందని చెప్పారు. వచ్చే ఏడాది నిర్వహించనున్న సదస్సుకు పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడే ఆహ్వానించడం ఆయన ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. రాష్ట్ర విభజన తర్వాత శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. పోర్టులు, విమానాశ్రయాలు, ఎలక్ట్రానిక్స్, అంతరిక్షం, రక్షణ, పర్యాటకం లాంటి రంగాల్లో ఏపీ భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తోందని వివరించారు.

ఒప్పందాలు.. ఆచరణలోకి రావాలి..

ప్రతి సంక్షోభం కొత్త అవకాశాలను కూడా తీసుకొస్తుందని, ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ ఆ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా దేశం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. సమీప భవిష్యత్తులో సాంకేతిక రంగం కీలక పాత్ర పోషించనుందని, కృత్రిమ మేధ (ఏఐ) లాంటి ఆధునిక సాంకేతికతను పాలన, పౌరసేవల్లో వినియోగించడం అభినందనీయమని ప్రశంసించారు. దేశీయ తయారీ రంగం, పరిశ్రమలు అంతర్జాతీయ పోటీని తట్టుకునేలా ఎదగాలని, ఎంఎస్ఎంఈలు, పెట్టుబడులకు ప్రోత్సాహం కల్పించడంతో పాటు మానవ వనరుల నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. కోవిడ్ సమయంలో భారత్ అభివృద్ధి చేసిన వ్యాక్సిన్లను వంద దేశాలకు అందించడం ద్వారా మన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పామని గుర్తుచేశారు. దేశ మేధోసంపత్తిని ప్రపంచానికి చాటేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేవలం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా వాటిని ఆచరణలో పెట్టి అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. 'కలిసి పనిచేద్దాం.. కలిసి ఎదుగుదాం.. సంపదను పంచుకుందాం' అనే స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఆయన పారిశ్రామికవేత్తలకు దిశానిర్దేశం చేశారు.



ముంచుకొస్తున్న 'అక్వాన్'

- ఏపీకి పొంచి ఉన్న మరో తుఫాన్ ముప్పు
- బంగాళాఖాతంలో ఏర్పడిన తాజా అల్పపీడనం
- పదహారు నాటికి తుఫాన్‌గా మారే అవకాశం
- పద్దెనిమిది, పంతొమ్మిది తేదీల్లో భారీ వర్షాలు
- తెలంగాణలో మూడు రోజులు పొడి వాతావరణం

అమరావతి, నవంబర్ 13 (సమయం న్యూస్): వరుస తుఫాన్ల ప్రభావం నుంచి ఆంధ్రప్రదేశ్ ఇంకా పూర్తిగా కోలుకోకముందే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతూ ఈ నెల పదిహేను నాటికి వాయుగుండంగా, పదహారు నాటికి తుఫాన్‌గా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ తాజా అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఈ అల్పపీడనం తుఫాన్‌గా మారితే దానికి 'అక్వాన్'గా పేరు పెట్టే అవకాశం ఉందని సమాచారం. గంటకు అరవై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఈ నెల పంతొమ్మిదవ తేదీ సాయంత్రం ఈ తుఫాన్ తీరాన్ని దాటే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి.

భారీ వర్షాల సూచన..

కొత్త వాతావరణ వ్యవస్థ ప్రభావంతో ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఈ నెల పద్దెనిమిది, పంతొమ్మిది తేదీల్లో భారీ వర్షాలు పడతాయని భావిస్తున్నారు. అయితే వర్షాల తీవ్రత, వ్యవస్థ పయనించే దిశ, తీరం దాటే ప్రాంతంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. భారత వాతావరణ శాఖ తాజా సమాచారం ప్రకారం బుధవారం ఏర్పడిన అల్పపీడనం గురువారం మరింత బలపడి, శుక్రవారం నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాతి తీవ్రత, గమనంపై ఇంకా స్పష్టమైన నిర్ధారణ జరగలేదు. మరోవైపు తెలంగాణలో రానున్న మూడు రోజులు పొడి వాతావరణం కొనసాగనుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

మొదలైంది.. పంచాయతీ పోరు!

- ఏపీలో తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్
- సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఈ నెల 26న పోలింగ్
- అధికారికంగా ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

అమరావతి, నవంబర్ 13 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల సందడి అధికారికంగా మొదలైంది. గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికలకు సంబంధించి తొలి విడత నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) శుక్రవారం విడుదల చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఈ మేరకు అధికారిక ప్రకటన జారీ చేశారు. దీని ప్రకారం రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలోని పలు రెవెన్యూ డివిజన్లు, మండలాల్లో ఉన్న గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఈ నెల 26వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. తాజా ఎన్నికల నోటిఫికేషన్‌తో రాష్ట్రవ్యాప్తంగా పల్లెల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. సర్పంచ్ పీఠాలను దక్కించుకునేందుకు ఆశావహులు ఇప్పటి నుంచే పావులు కదపడం ప్రారంభించారు. అయితే న్యాయస్థానాల నుంచి స్టే ఉత్తర్వులు ఉన్న పంచాయతీలు లేదా ఇతర న్యాయ, పరిపాలనాపరమైన అడ్డంకులు ఉన్న చోట్ల ఎలాంటి ఎన్నికల నోటీసులు జారీ చేయవద్దని జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ఎస్ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. శుక్రవారం (నవంబర్ 15) ఉదయం పదిన్నర గంటల నుంచి 17వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. వార్డుల వారీగా ఓటర్ల జాబితాను కూడా 15వ తేదీనే ప్రదర్శిస్తారు. దాఖలైన నామినేషన్ల పరిశీలన 18వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి జరుగుతుంది. తిరస్కరించిన నామినేషన్లపై అప్పీలు చేసుకునేందుకు 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఆర్డీవో వద్ద అవకాశం కల్పించారు. ఈ అప్పీళ్లను 20వ తేదీన పరిష్కరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 21వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు ఉంటుంది. ఆ వెంటనే మధ్యాహ్నం మూడు గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను



అధికారికంగా ప్రకటిస్తారు. ఇక 26వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుంది. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి, పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటిస్తారు. ఆ వెంటనే ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు. ఒకవేళ అనివార్య కారణాల వల్ల ఆ రోజు కుదరకపోతే మరుసటి రోజున (సెలవు దినమైనా సరే) ఉప సర్పంచ్ ఎన్నిక తప్పనిసరిగా నిర్వహించాలని ఎస్ఈసీ స్పష్టం చేసింది. ఎక్కడైనా రీపోలింగ్ అవసరమైతే 27వ తేదీన నిర్వహిస్తారు.

ఏటా ఆడిట్.. రిపోర్ట్!

- పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా పర్యవేక్షణ
- జూన్ నుంచి వచ్చిన పెట్టుబడులకు చట్టపరమైన రక్షణ
- అనుమతులకు సెల్ఫ్ సర్టిఫికేషన్, రియల్ టైమ్ క్లియరెన్స్
- 32.49 లక్షల కోట్లకు చేరిన రాష్ట్ర పెట్టుబడి ప్రతిపాదనలు
- ఎంఎస్ఎంఈల ప్రోత్సాహానికి 25 సెక్టోరల్ పార్కుల ఏర్పాటు
- టెక్నాలజీపై విమర్శించే వాళ్లు ముందుగా నేర్చుకోవాలి
- సీఐఐ ముగింపు తర్వాత మీడియాతో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, నవంబర్ 13 (సమయం న్యూస్): పారిశ్రామిక పెట్టుబడుల ఒప్పందాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చేలా నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. కుదుర్చుకున్న ఎంఓయూల అమలు పురోగతిపై ప్రతి ఏడాది ఆడిట్ రిపోర్ట్ విడుదల చేస్తామని ఆయన ప్రకటించారు. శుక్రవారం విశాఖపట్నంలో ముగిసిన సీఐఐ భాగస్వామ్య సదస్సు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2024 జూన్ నుంచి రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులకు రక్షణ కల్పించేలా ప్రత్యేకంగా 'ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్' రూపొందించి కేంద్రం ఆమోదానికి పంపుతామని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా అడుగులు వేస్తున్నామని, సెల్ఫ్ సర్టిఫికేషన్‌తోనే అనుమతుల ప్రక్రియ ప్రారంభించి రియల్ టైమ్‌లో క్లియరెన్స్ ఇస్తున్నామని వెల్లడించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపుల్లో పారదర్శకత కోసం నవంబర్ 12 నుంచి 'ఎస్క్రో ఖాతా' అమల్లోకి తెచ్చామన్నారు. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి మొత్తం 32.49 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని సీఎం వివరించారు. కియా సంస్థ ఏకంగా 18,878 కోట్ల పెట్టుబడితో పెనుకొండ ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యాన్ని రెండు లక్షల వాహనాలకు పెంచుతోందని, దీనిద్వారా అదనంగా 12 వేల ఉద్యోగ అవకాశాలు రానున్నాయన్నారు. రాష్ట్రంలో కొత్తగా 25 సెక్టోరల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఎంఎస్ఎంఈలకు మద్దతు అందిస్తామని తెలిపారు. అమరావతిని క్వాంటం కంప్యూటర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని, భవిష్యత్తులో మేడ్ ఇన్ అమరావతి క్వాంటం కంప్యూటర్లు విదేశాలకు ఎగుమతి అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



అసాధ్యాలను సుసాధ్యం చేసే టెక్నాలజీ..

శాటిలైట్లలో డేటా సెంటర్ల ఏర్పాటు, అంతరిక్షం నుంచి విద్యుత్ ఉత్పత్తి లాంటి వినూత్న అంశాలపై అధ్యయనాలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. స్పేస్ నుంచి విద్యుత్ ఇస్తామంటే కొందరు ఎగతాళి చేస్తున్నారని, గతంలో తుఫాన్ విషయంలో ఇలాగే అన్నవాళ్ల నోళ్లు టెక్నాలజీ మూయించిందని గుర్తుచేశారు. టెక్నాలజీ అర్థం కాకుంటే నేర్చుకోవడం మంచిదని, అసాధ్యాన్ని సుసాధ్యం చేసే సత్తా టెక్నాలజీకి ఉందని స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేయడంతో పాటు ఏఐ స్టాక్ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. మొండలీజ్ సంస్థతో కలిసి కోకో మిషన్, అరకు కాఫీ ప్రమోషన్ కోసం ప్రత్యేక ఒప్పందాలు కుదుర్చుకున్నామని వివరించారు. స్కిల్ సెన్సస్ ద్వారా నైపుణ్యమున్న మానవ వనరులను గుర్తించి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్రంలో రవాణా కనెక్టివిటీ పెంపుతో పాటు 35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రాల మధ్య అభివృద్ధిలో ఎప్పుడూ పోటీ ఉంటుందని, పరస్పరం సహకరించుకుంటూనే అభివృద్ధిలో పోటీ పడతామన్నారు. గత ఐదేళ్ల పాలనలో విభజన కంటే ఎక్కువ నష్టం జరిగిందని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, నారాయణ, పార్థసారథి, కొల్లు రవీంద్ర, సత్యకుమార్, కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు.. మీరే కారణం!

- ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుతోనే విద్యార్థుల బలిదానాలు
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌పై జగన్ ఫైర్
- చిత్తూరు ఇంజినీరింగ్ కాలేజీ ఘటనపై తీవ్ర ఆగ్రహం

అమరావతి, నవంబర్ 14 (సమయం న్యూస్): చిత్తూరులోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై నిప్పులు చెరిగారు. విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి విద్యాశాఖ మంత్రిగా ఉన్న మీ సుపుత్రుడు నారా లోకేష్ కారణం కాదా అంటూ సీఎం చంద్రబాబును జగన్ సూటిగా ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి మీరిద్దరూ ఉరితాడు బిగిస్తే, అదే ఉరితాడు ఇప్పుడు అమాయక విద్యార్థుల ప్రాణాల మీదకు వస్తోందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ దారుణమైన పరిస్థితికి ముమ్మాటికీ మీరే బాధ్యులంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫీజులు కట్టకపోవడంతోనే తమకు ఈ దుస్థితి వచ్చిందని, ఇదే కళాశాలలో గతంలో కూడా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటూ రోడ్డెక్కి మరీ ఆందోళన చేస్తున్నారని ఆయన గుర్తుచేశారు. విద్యార్థుల తమ ఆవేదన, ఆగ్రహాన్ని వెళ్లగక్కుతున్నా చంద్రబాబు మాత్రం కనీసం పట్టనట్టే వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.



పథకాలను నిర్వీర్యం చేసి.. ఉసురు పోసుకుంటున్నారు..

విద్యార్థుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా చంద్రబాబు టాపిక్ డైవర్ట్ చేసే ప్రయత్నం చేస్తున్నారని జగన్ విమర్శించారు. చంద్రబాబు, ఆయన కుమారుడు తమ బాధ్యతలను పూర్తిగా గాలికి వదిలేయడం అత్యంత దారుణమన్నారు. ఇంత దుర్మార్గమైన పాలన గతంలో రాష్ట్రంలో ఎప్పుడూ చూడలేదని ఆయన ధ్వజమెత్తారు. పేదవాళ్లకు గొప్ప చదువులే లక్ష్యంగా తమ గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి నుంచి విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో దేశంలో ఎక్కడాలేని విధంగా గొప్ప విద్యావిధానాన్ని తీసుకువచ్చామని జగన్ గుర్తుచేశారు. తాము ఆ పథకాలు విజయవంతంగా అమలు చేస్తే.. టీడీపీ అధికారంలోకి వచ్చిన తొలి క్షణం నుంచే పేదలను ఉన్నత చదువులకు దూరం చేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. అందులో భాగంగానే ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలను ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. బంగారం లాంటి పేద పిల్లల భవిష్యత్తును పూర్తిగా నాశనం చేసి, వారి చదువుల ఉసురు పోసుకుంటున్నారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

బీసీల ఇళ్లపై.. సౌర వెలుగులు!

- 'పీఎం సూర్య ఘర్'ను విస్తరించాలని సీఎం లేఖ
- కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి అందజేసిన చంద్రబాబు
- రాష్ట్రంలో ఏకంగా 9.24 లక్షల కుటుంబాలకు ప్రయోజనం
- అదనంగా ప్రతి కుటుంబానికీ 20 వేల రాష్ట్ర సబ్సిడీ
- ముందస్తు భారం లేకుండా రుణాల ద్వారా సమీకరణ
- రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటులో ఏపీకి నాలుగో స్థానం

విశాఖపట్నం, నవంబర్ 13 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లోని 9,24,069 బీసీ కుటుంబాలకు 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' పథకం ప్రయోజనాలను విస్తరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ఈ మేరకు ఆయన లేఖ అందజేశారు. తొలి విడతలో సుమారు 1,848 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ సామర్థ్యాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని సీఎం తెలిపారు. అర్హులైన ప్రతి బీసీ కుటుంబానికి కేంద్ర ఆర్థిక సహాయానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం 20 వేల రూపాయల చొప్పున సబ్సిడీ అందించనుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి సుమారు రూ.5,544 కోట్ల ఆర్థిక సహాయం అవసరం కాగా.. రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా రూ.1,848 కోట్ల సాయం చేయనుందని ఆయన వివరించారు.



అర్హులందరికీ వర్తింపజేయండి..

లబ్ధిదారులపై ఎలాంటి ముందస్తు ఆర్థిక భారం పడకుండా మిగిలిన ప్రాజెక్టు వ్యయాన్ని సంస్థాగత రుణాల ద్వారా సమీకరించాలని ప్రతిపాదించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. దీనివల్ల నిరుపేద బీసీలకు ఉచితంగా సౌర విద్యుత్ సదుపాయం కల్పించవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదికలను సెప్టెంబర్ ఎనిమిదో తేదీనే కేంద్రానికి సమర్పించినట్లు వెల్లడించారు. ఆ నివేదికలకు ఆమోదం తెలుపుతూ రాష్ట్రంలోని 9,24,069 బీసీ కుటుంబాలకు ఈ పథకం వర్తింపజేయాలని, దీనికి అవసరమైన ఆర్థిక సాయాన్ని మంజూరు చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే 4,56,235 గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశామని, అక్టోబర్ పదమూడు నాటికి ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నాలుగో స్థానంలో నిలిచిందని లేఖలో గుర్తుచేశారు. తాజా ప్రతిపాదనలు ఆమోదం పొందితే రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన వినియోగం మరింత విస్తరించడంతో పాటు లక్షలాది బీసీ కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు.

సంపాదకీయం



సంక్షేమ పంపిణీలో నవశకం!

నిధుల పక్కదారికి ఈ-రూపీతో పూర్తి అడ్డుకట్ట

బ్యాంకు ఖాతా, ఇంటర్నెట్ లేకున్నా ప్రయోజనం

లబ్ధిదారుడి ఫోన్‌కే నేరుగా డిజిటల్ వోచర్

నిర్దేశించిన అవసరానికి మాత్రమే వాడుకునే వీలు

సైబర్ భద్రత, డిజిటల్ అవగాహనే కీలకం

డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వైపు భారత్ శరవేగంగా అడుగులు వేస్తున్న తరుణంలో సంక్షేమ పథకాల అమలులో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వం పేదల కోసం ఒక్క రూపాయి విడుదల చేస్తే దళారుల చేతివాటంతో లబ్ధిదారుడికి కేవలం పదిహేను పైసలు మాత్రమే చేరేవన్న విమర్శలు ఉండేవి. ఆ తర్వాత వచ్చిన జన్‌ధన్, ఆధార్, మొబైల్ (జామ్) అనుసంధానంతో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానం అమల్లోకి వచ్చి మధ్యవర్తుల బెడద తప్పింది. అయితే బ్యాంకు ఖాతాల్లో నేరుగా పడుతున్న నగదు నిజంగానే నిర్దేశించిన ప్రయోజనం కోసమే ఖర్చవుతోందా అన్నది ఇప్పటికీ పెద్ద ప్రశ్నగానే మిగిలిపోయింది. సరిగ్గా ఈ లోపాన్ని సవరించి, సంక్షేమ పంపిణీలో నూటికి నూరు శాతం పారదర్శకత తెచ్చేందుకే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఆధ్వర్యంలో 'ఈ-రూపీ' అనే సరికొత్త డిజిటల్ వోచర్ వ్యవస్థ రూపుదిద్దుకుంది. ప్రభుత్వమైనా, ప్రైవేటు సంస్థలైనా తాము అందించాలనుకున్న ఆర్థిక సహాయాన్ని ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం మాత్రమే వినియోగించేలా లబ్ధిదారులకు ఈ ప్రీపెయిడ్ వోచర్లను జారీ చేయవచ్చు.

అసలు ఎలా పనిచేస్తుంది..

ఈ-రూపీ అనేది పూర్తిగా నగదు రహిత, కాంటాక్ట్‌లెస్ డిజిటల్ చెల్లింపుల వేదిక. ఇందులో లబ్ధిదారుడి మొబైల్ ఫోన్‌కు నేరుగా ఒక క్యూఆర్ కోడ్ లేదా ఎస్ఎంఎస్ స్ట్రింగ్ రూపంలో ఈ-వోచర్ వస్తుంది. దీనికున్న అతిపెద్ద ప్రత్యేకత ఏమిటంటే.. లబ్ధిదారుడికి అసలు బ్యాంకు ఖాతా గానీ, డెబిట్ కార్డు గానీ, మొబైల్ బ్యాంకింగ్ యాప్ గానీ ఉండాల్సిన అవసరమే లేదు. చివరికి స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ సదుపాయం లేకపోయినా సరే సాధారణ ఫీచర్ ఫోన్‌కు వచ్చే ఎస్ఎంఎస్ కోడ్‌ను చూపించి సేవలు పొందవచ్చు. దేశంలో నేటికీ బ్యాంకింగ్ సేవలకు దూరంగా ఉన్న కోట్లాది మందిని ఆర్థిక స్రవంతిలోకి తీసుకురావడానికి ఇదొక తిరుగులేని ఆయుధం. ఉదాహరణకు గర్భిణులకు పోషకాహారం కోసమో, క్షయ (టీబీ) రోగులకు మందుల కోసమో, రైతులకు ఎరువుల రాయితీ కోసమో ప్రభుత్వం డబ్బులు ఇస్తే.. ఆ నిధులు మద్యం తాగడానికో, ఇతర కుటుంబ ఖర్చులకో మళ్లిపోయే ప్రమాదం గతంలో ఉండేది. కానీ ఈ-రూపీ వోచర్‌ను మాత్రం ప్రభుత్వం అనుమతించిన ఆసుపత్రిలో, మందుల దుకాణంలో లేదా ఎరువుల కేంద్రంలో మాత్రమే వాడుకోవాల్సి ఉంటుంది. అక్కడ లబ్ధిదారుడు తన ఫోన్‌లోని కోడ్ చూపించగానే నిర్వాహకులు దాన్ని స్కాన్ చేసి, ఓటీపీ ద్వారా ధ్రువీకరించుకుని నిర్దేశిత వస్తువు లేదా సేవను అందిస్తారు.

విస్తృత ప్రయోజనాలు.. స్పష్టమైన తేడా..

ఈ విధానం కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలకే పరిమితం కాదు. ఆరోగ్యం, విద్య, పోషకాహారం, వ్యవసాయం, నైపుణ్యాభివృద్ధి లాంటి ఎన్నో రంగాల్లో దీన్ని అద్భుతంగా వినియోగించుకోవచ్చు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లు, ఉపకార వేతనాల పంపిణీలో అక్రమాలకు తావుండదు. ప్రైవేటు కార్పొరేట్ సంస్థలు కూడా తమ ఉద్యోగుల ఆహార, ఆరోగ్య భత్యాల కోసం, సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల కింద పేదలకు సాయం చేసేందుకు ఈ వోచర్లను కొనుగోలు చేసి ఇవ్వవచ్చు. మరోవైపు చాలా మంది ఈ-రూపీని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జారీ చేసే డిజిటల్ రూపాయితో (సీబీడీసీ) కలిపి చూస్తుంటారు. కానీ ఈ రెండింటికీ స్పష్టమైన తేడా ఉంది. ఆర్‌బీఐ ఇచ్చే డిజిటల్ రూపాయి అనేది మన జేబులో ఉండే కరెన్సీ నోటుకు ప్రత్యామ్నాయమైన చట్టబద్ధమైన డిజిటల్ కరెన్సీ. దాన్ని ఎక్కడైనా, ఏ అవసరానికైనా వాడుకోవచ్చు. కానీ ఈ-రూపీ అనేది కేవలం ఏ వ్యక్తికైతే జారీ చేశారో ఆ వ్యక్తి మాత్రమే, ఏ పని కోసమైతే ఇచ్చారో ఆ పనికి మాత్రమే వాడుకునే ఒక డిజిటల్ కూపన్.

సవాళ్లను అధిగమిస్తేనే సత్ఫలితాలు..

ఆశయం ఎంత గొప్పదైనా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించినప్పుడే ఏ సాంకేతికతకైనా సార్థకత చేకూరుతుంది. కేవలం డిజిటల్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినంత మాత్రాన సరిపోదు. మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఈ వోచర్లను స్వీకరించే వ్యాపార, సేవా కేంద్రాల నెట్‌వర్క్‌ను విస్తృతం చేయాలి. నిరక్షరాస్యులు, వృద్ధులు తమ ఫోన్‌కు వచ్చిన ఎస్ఎంఎస్ కోడ్‌ను, ఓటీపీని సైబర్ నేరగాళ్ల చేతిలో పెట్టకుండా ఉండేలా విస్తృత అవగాహన కల్పించాలి. ఫోన్ పోయినా, మెసేజ్ డిలీట్ అయినా తిరిగి ఆ వోచర్‌ను పొందేలా గ్రామ స్థాయిలో సులభతరమైన ప్రత్యామ్నాయ సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలి. అలాగే కోట్లాది మంది లబ్ధిదారుల వ్యక్తిగత సమాచార గోప్యతకు భంగం కలగకుండా పటిష్టమైన సైబర్ భద్రతా కవచాన్ని నిర్మించాలి. ప్రభుత్వం ఇచ్చే ప్రతి పైసా సరైన వ్యక్తికి, సరైన సమయంలో, సరైన ప్రయోజనం కోసం చేరాలన్న లక్ష్యాన్ని ఈ-రూపీ నిజం చేయగలదు. సాంకేతికతకు పారదర్శకమైన నియంత్రణ, ప్రజల్లో చైతన్యం తోడైతే భారత సంక్షేమ పంపిణీ చరిత్రలో ఈ-రూపీ ఒక సువర్ణాధ్యాయంగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

మహిళా కోటాపై కేంద్రం పట్టు

- మరోసారి డీలిమిటేషన్ బిల్లు!
- రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి కేంద్రం కసరత్తు
- ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల నిర్వహణపై చర్చ
- మూడింట రెండొంతుల మెజారిటీ సాధిస్తామన్న ధీమా
- అవసరమైన మెజారిటీ కంటే 15-18 ఓట్లు అదనంగా వస్తాయని అంచనా
- లోక్‌సభ స్థానాలను 543 నుంచి 850కి పెంచే ప్రతిపాదన
- 2029 ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లే లక్ష్యం
- దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాల పరిష్కారంపైనా దృష్టి



న్యూఢిల్లీ, నవంబర్ 13 (సమయం న్యూస్): పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లును తీసుకురావడంపై కేంద్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు ప్రారంభించింది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ఈ కీలక రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు త్వరలోనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళా కోటాను అమలులోకి తీసుకురావాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. రాజ్యాంగ సవరణ బిల్లులు పార్లమెంట్‌లో ఆమోదం పొందాలంటే లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ, అంటే కనీసం 361 మంది సభ్యుల మద్దతు తప్పనిసరి. ఇందుకోసం తెరవెనుక విపక్షాలు, ఇతర పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈసారి బిల్లు ఆమోదానికి అవసరమైన 361 ఓట్ల కన్నా అదనంగా మరో 15 నుంచి 18 ఓట్లు తమకు లభిస్తాయని ఎన్డీయే వర్గాలు పూర్తి ధీమా వ్యక్తం చేస్తున్నాయి. గతంలో ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల ప్రత్యేక భేటీలో భాగంగా మహిళా రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణ బిల్లును ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అయితే, ఆ సమయంలో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు రావడంతో మూడింట రెండొంతుల మెజారిటీ లభించక ఆ బిల్లు వీగిపోయింది. మరోవైపు, ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ఇప్పటివరకు అధికారికంగా ప్రొరోగ్ (ముగింపు) చేయలేదు. దీనివల్ల ఎప్పుడైనా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి వెసులుబాటు ఏర్పడింది. దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాల పరిష్కారానికి ప్రణాళిక: డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 ఎంపీ స్థానాలను ఏకంగా 850కి పెంచాలని కేంద్రం యోచిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం తగ్గిపోతుందంటూ దక్షిణాది నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అభ్యంతరాలను పరిష్కరించేందుకు కేంద్రం పలు ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఎంపీ స్థానాలను 50 శాతం మేర పెంచడం లేదా రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తిని 1971 జనాభా లెక్కల ఆధారంగానే యథాతథంగా కొనసాగించడం వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. అయితే, ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల తేదీలపై ప్రభుత్వం నుంచి ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

అస్సాంలో మృత్యుఘోష

ట్రక్కు-మినీ బస్సు ఢీకొని 23 మంది దుర్మరణం! ■ కాజిరంగ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

గువాహటి/కాజిరంగ, నవంబర్ 13 (సమయం న్యూస్): అస్సాంలోని కాజిరంగ జాతీయ ఉద్యానవనం సమీపంలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జాతీయ రహదారి-715పై రొంగాజన్ (హతికులి టీ ఎస్టేట్) ప్రాంతంలో ప్రయాణికులతో వెళ్తున్న మినీ బస్సు (ట్రావెలర్), ఎదురుగా వస్తున్న భారీ కంటైనర్ ట్రక్కు అత్యంత వేగంతో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ పెను విషాదంలో 23 మంది ప్రయాణికులు దుర్మరణం పాలవగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు మినీ బస్సు పూర్తిగా నుజ్జునుజ్జు కాగా, మరణించిన వారిలో ఎక్కువ మంది కళాశాల విద్యార్థులే ఉన్నట్లు తెలుస్తోంది. గోలాఘాట్ జిల్లాలోని బొకాఖాట్ నుంచి పొరుగు జిల్లా అయిన నగావ్ వైపు వెళ్తున్న మినీ బస్సును, తేజ్‌పూర్ నుంచి దిబ్రూగఢ్ వైపు వెళ్తున్న కంటైనర్ ట్రక్కు ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. బస్సు శిథిలాల్లో చిక్కుకున్న మృతదేహాలను బయటకు తీస్తున్నామని, 23 మంది మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించామని గోలాఘాట్ సీనియర్ ఎస్పీ స్వప్ననీల్ దేకా వెల్లడించారు. గాయపడిన వారిని తొలుత కోహోరా మోడల్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉన్నవారిని మెరుగైన చికిత్స కోసం గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేసి జోర్హాట్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రికి తరలించారు. కాజిరంగ నేషనల్ పార్క్ సమీపంలో వాహన వేగంపై ఉన్న నిబంధనలను ఉల్లంఘిస్తూ మినీ బస్సు అతివేగంతో ప్రయాణించిందని, డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. కాగా, ప్రమాదానికి గురైన ఈ వాహనంపై గతంలోనే ఓవర్‌స్పీడింగ్‌కు సంబంధించి పలు చలాన్లు ఉన్నట్లు విచారణలో తేలింది. ఈ ఘోర దుర్ఘటనపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ సర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన, క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే అతుల్ బోరా స్వయంగా ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండే అవకాశం ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఒక నగ్న ఫొటోకు.. ఓ యుద్ధ ప్లాన్ లీక్..

- పాక్ గూఢచారితో ఐఏఎఫ్ అధికారి బేరం!
- పాక్ యువతి వలపు వలలో చిక్కుకుని దేశ రహస్యాలను తాకట్టు పెట్టిన వింగ్ కమాండర్
- రహస్య డ్రోన్ యూనిట్లు, యుద్ధ విమానాల మోహరింపు సమాచారాన్ని లీక్ చేసిన వైనం
- సబ్‌ఆర్డినేట్‌ల ఫోన్లలోనూ మాల్‌వేర్ యాప్ ఇన్‌స్టాల్ చేయించిన నిందితుడు
- కోర్టులో ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో విస్తుపోయే వాస్తవాలు వెల్లడి



న్యూఢిల్లీ, నవంబర్ 13 (సమయం న్యూస్): పాకిస్థాన్ గూఢచారి వలపు వలలో (హనీ ట్రాప్) చిక్కుకున్న భారత వాయుసేన (ఐఏఎఫ్) అధికారి ఒకరు అత్యంత కీలకమైన దేశ రక్షణ రహస్యాలను శత్రువుల చేతికి అందజేశారు. కేవలం ఆ యువతి పంపే నగ్న చిత్రాల కోసం దేశ భద్రతకు సంబంధించిన యుద్ధ ప్రణాళికలు, సైనిక మోహరింపు సమాచారాన్ని బేరం పెట్టిన సంచలన ఉదంతం వెలుగులోకి వచ్చింది. కొన్ని నెలల క్రితం అరెస్టయిన ఈ అధికారిపై దిల్లీ పోలీసులు తాజాగా కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంతో ఈ విస్తుపోయే వాస్తవాలు బయటపడ్డాయి.

వాట్సప్‌లో వేలాది సందేశాలు.. రహస్యాల లీక్:

భారత వాయుసేనలో వింగ్ కమాండర్‌గా పనిచేస్తున్న నిందితుడికి ఆన్‌లైన్ వేదికగా సదరు పాక్ గూఢచారితో పరిచయం ఏర్పడింది. ఈ ఏడాది జనవరి 12 నుంచి ఏప్రిల్ 1 మధ్య వీరిద్దరూ వాట్సప్‌లో నిరంతరం సంభాషణలు సాగించారు. ఈ క్రమంలో దాదాపు 3,000లకు పైగా టెక్స్ట్ సందేశాలు, 65 ఫొటోలు పంపించుకున్నట్లు దర్యాప్తులో తేలింది. అంతేకాకుండా వీరి మధ్య 42 వాయిస్ కాల్స్, నాలుగు వీడియో కాల్స్ జరగగా, ఆరు యూఆర్ఎల్స్‌ను కూడా పరస్పరం షేర్ చేసుకున్నారు. భారత్ వద్ద ఉన్న డ్రోన్ సామర్థ్యాలు, సీక్రెట్ డ్రోన్ యూనిట్, సైనిక స్థావరాల వివరాలు, సరిహద్దుల్లో ఉద్రిక్తతల వేళ ముందుగా మోహరించే యుద్ధ విమానాల వంటి అత్యంత సున్నితమైన సమాచారాన్ని సదరు అధికారి పాక్ గూఢచారికి చేరవేశారు.

ఒక్కో నగ్న ఫొటోకు.. ఒక్కో వార్ ప్లాన్ పేజీ:

ఈ వ్యవహారంలో అధికారి వ్యవహరించిన తీరు దర్యాప్తు అధికారులనే విస్మయానికి గురిచేసింది. ఆ గూఢచారి తన నగ్న చిత్రాన్ని పంపిన ప్రతిసారీ, నిందితుడు మన సీక్రెట్ వార్ ప్లాన్‌కు సంబంధించిన ఒక్కో పేజీని ఆమెకు షేర్ చేసినట్లు పోలీసులు ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. ఆమె పంపే ప్రతి నగ్న ఫొటోకు బదులుగా యుద్ధ ప్రణాళికకు సంబంధించిన కొత్త పేజీని పంపిస్తానని అతడు ఆఫర్ ఇచ్చినట్లు తేలింది. వీటితో పాటు లేహ్‌లోని యుద్ధ విమానాల మోహరింపు, సూరత్‌గఢ్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ వద్ద జరిగే మిలిటరీ విన్యాసాల వివరాలను కూడా లీక్ చేశాడు. అంతేకాకుండా, పాక్ గూఢచారి పంపిన ఒక ప్రమాదకరమైన మాల్‌వేర్ యాప్‌ను తన కింద పనిచేసే సబ్‌ఆర్డినేట్ సిబ్బంది డివైజ్‌లలోనూ ఇన్‌స్టాల్ చేయించినట్లు దర్యాప్తులో బయటపడింది.

స్మార్ట్‌ఫోన్‌తో దొరికిపోయిన వైనం:

ఈ అధికారి దేశద్రోహ చర్యలు మే నెలలోనే వెలుగులోకి వచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా ఓసారి కార్యాలయంలోకి స్మార్ట్‌ఫోన్ తీసుకొచ్చిన అతడిని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. తనిఖీల్లో అనుమానాస్పద అంశాలు గుర్తించిన ఎయిర్‌ఫోర్స్ అధికారులు వెంటనే సదరు వింగ్ కమాండర్‌పై ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన దిల్లీ పోలీసులు మే 30న అతడిని అరెస్టు చేసి తీహాడ్ జైలుకు తరలించారు. లోతైన దర్యాప్తు అనంతరం తాజాగా కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.

టీబీ మరణాల తగ్గింపులో మనమే టాప్!

డబ్ల్యూహెచ్‌వో గ్లోబల్ రిపోర్ట్‌లో వెల్లడైన వివరాలు

- భారత్‌లో 38 శాతం తగ్గిన టీబీ మరణాలు
- టీబీ రోగుల్లో 94 శాతం మేర విజయవంతమైన చికిత్స
- 25 కోట్ల మందికి పైగా టీబీ స్క్రీనింగ్ పరీక్షలు
- పోషణ్ యోజన కింద రోగులకు ఆర్థిక సహకారం



న్యూఢిల్లీ, నవంబర్ 13 (సమయం న్యూస్): ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) విడుదల చేసిన గ్లోబల్ ట్యూబర్‌క్యులోసిస్ రిపోర్ట్-2026 ప్రకారం భారత్‌లో 2015తో పోలిస్తే టీబీ మరణాలు ఏకంగా 38 శాతం తగ్గాయి. ఇదే కాలంలో ప్రపంచవ్యాప్తంగా మరణాలు 35 శాతం తగ్గగా, భారత్ అంతకంటే మెరుగైన పురోగతి సాధించింది. దేశంలో టీబీ రోగుల్లో 94 శాతం చికిత్స విజయవంతం అవుతున్నట్లు నివేదిక వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ముందస్తు గుర్తింపు, ఏఐ ఆధారిత ఎక్స్‌రేలు, వేగవంతమైన మాలిక్యులర్ పరీక్షలు, సకాలంలో చికిత్స, పోషకాహార సహాయం లాంటి చర్యలు అద్భుతమైన ఫలితాలను అందిస్తున్నాయి. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద 2024 డిసెంబర్ నుంచి 2026 నవంబర్ 8 వరకు 25 కోట్ల మందికి పైగా టీబీ స్క్రీనింగ్ నిర్వహించారు. పదకొండు కోట్లకు పైగా ఛాతీ ఎక్స్‌రేలు, మూడు కోట్లకు పైగా మాలిక్యులర్ పరీక్షలు నిర్వహించగా.. 48.64 లక్షల టీబీ కేసులు గుర్తించారు. వీటిలో 14.97 లక్షల లక్షణాలు లేని కేసులు కూడా ఉన్నాయి.

పోషకాహారం, ఆర్థిక సహకారం..

దేశంలో టీబీ కార్యక్రమానికి అవసరమైన నిధుల్లో 96 శాతం దేశీయ వనరుల నుంచే సమకూరుతున్నాయి. 2025లో 67,933 పంచాయతీలను టీబీ రహిత పంచాయతీలుగా ప్రకటించారు. ని-క్షయ్ పోషణ్ యోజన, ని-క్షయ్ మిత్ర కార్యక్రమాల ద్వారా రోగులకు పోషకాహారం, ఆర్థిక, సామాజిక సహకారం అందిస్తున్నారు. ఏఐ సాంకేతికత, డిజిటల్ ని-క్షయ్ ప్లాట్‌ఫామ్, వేగవంతమైన నిర్ధారణ వ్యవస్థలు దేశంలో టీబీ నియంత్రణను మరింత బలోపేతం చేస్తున్నాయి.

దక్షిణ మధ్య రైల్వే.. భోలు ఏఐ!



ఏడు స్టేషన్లకు విస్తరించిన భోలు ఏఐ సేవలు

రైళ్ల వివరాలు, బెర్తుల లభ్యత సులువుగా తెలుసుకునే అవకాశం

రోజువారీ వినియోగం రెండు వేల మందికి పైగా పెరుగుదల

హైదరాబాద్ డివిజన్ బృందాన్ని అభినందించిన జనరల్ మేనేజర్

సికింద్రాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సమాచార సేవలను ఆధునీకరిస్తూ యాత్రి ఎల్ఎల్ఎం ఆధారిత భోలు ఏఐ సేవలను మరింత విస్తరించింది. కొత్తగా కాచిగూడ, మల్కాజిగిరితో పాటు కర్నూలు సిటీ, గద్వాల్, మహబూబ్‌నగర్, కామారెడ్డి, నిజామాబాద్ రైల్వే స్టేషన్లలో భోలు ఏఐ సేవలు తాజాగా అందుబాటులోకి వచ్చాయి. రైళ్ల రాకపోకలు, బెర్తుల లభ్యత, కోచ్ స్థానాలు, స్టేషన్ మ్యాప్‌లు, ప్రయాణికుల సౌకర్యాల వివరాలను ప్రయాణికులు ఈ భోలు ద్వారా ఇట్టే తెలుసుకోవచ్చు. రోజువారీ వినియోగం 200 మంది నుంచి రెండు వేల మందికి పైగా పెరిగిందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. భోలు మినీ, భోలు మాక్స్ రూపాల్లో వాయిస్, టచ్‌స్క్రీన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రయాణికుల సేవలను మెరుగుపరిచిన హైదరాబాద్ డివిజన్ బృందాన్ని జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రత్యేకంగా అభినందించారు.

బిర్సా ముండాకు ఘన నివాళి!

జనజాతీయ గౌరవ దినోత్సవం సందర్భంగా పుష్పాంజలి

స్వాతంత్ర్య సమరంలో ఆయన పోరాటాన్ని స్మరించుకున్న నేతలు

రైల్ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం

పాల్గొన్న రైల్వే శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది



న్యూఢిల్లీ, నవంబర్ 13 (సమయం న్యూస్): జనజాతీయ గౌరవ దినోత్సవం సందర్భంగా రైల్వే మంత్రిత్వ శాఖ రైల్ భవన్‌లో భగవాన్ బిర్సా ముండాకు ఘనంగా పుష్పాంజలి ఘటించింది. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరంలో బిర్సా ముండా చేసిన అలుపెరగని పోరాటాన్ని, గిరిజనుల హక్కులు, గౌరవం కోసం ఆయన చేసిన విశేష కృషిని రైల్వే అధికారులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు సభ్యులతో పాటు పలువురు ఉన్నతాధికారులు, రైల్ భవన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీ భవిష్యత్తు.. ముందే పసిగట్టా!

సీఐఐ సదస్సు ఫైర్‌సైడ్ చాట్‌లో సీఎం చంద్రబాబు

హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఏర్పాటుపై కీలక వ్యాఖ్యలు

అప్పుడే బిల్ గేట్స్‌ను ఒప్పించిన వైనాన్ని గుర్తుచేసుకున్న సీఎం

ఐటీ మానవ వనరుల కోసమే ఇంజినీరింగ్ కాలేజీలకు అనుమతులు



విశాఖపట్నం, నవంబర్ 13 (సమయం న్యూస్): ఐటీ రంగ భవిష్యత్తును తాను ముందుగానే పసిగట్టి, అప్పట్లోనే హైదరాబాద్‌లో ఆ రంగానికి అత్యధిక ప్రాధాన్యత కల్పించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజు సీనియర్ జర్నలిస్ట్ పాల్కీ శర్మతో జరిగిన ఫైర్‌సైడ్ చాట్‌లో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు అప్పట్లో బిల్ గేట్స్‌ను తాను ఎలా ఒప్పించిందీ చంద్రబాబు గుర్తుచేశారు. భారతీయ విద్యార్థుల్లోని గణితం, ఇంగ్లిష్ నైపుణ్యాలు ఐటీ రంగానికి ఎంతగానో ఉపయోగపడతాయని ఆయనకు వివరించినట్లు చెప్పారు. ఆ తర్వాత ఐటీ రంగానికి అవసరమైన మానవ వనరులను సిద్ధం చేసేందుకు పెద్దఎత్తున ఇంజినీరింగ్ కళాశాలలకు అనుమతులు ఇచ్చామన్నారు. ఐటీ సంస్కరణలతో పాటు దేశంలోనే తొలిసారిగా విద్యుత్ రంగంలోనూ తామే సంస్కరణలు చేపట్టామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎగుమతుల్లో.. భారీ వృద్ధి!

- ఏప్రిల్-అక్టోబర్ కాలంలో 16.66 శాతం పెరుగుదల
- 568.84 బిలియన్ డాలర్లకు చేరిన వస్తు, సేవల ఎగుమతులు
- అక్టోబర్‌లో గణనీయంగా పెరిగిన పెట్రోలియం ఎగుమతులు
- భారత ఎగుమతులకు తోడ్పడ్డ అమెరికా, చైనా మార్కెట్లు



న్యూఢిల్లీ, నవంబర్ 13 (సమయం న్యూస్): దేశ ఎగుమతులు భారీగా పెరుగుతున్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబర్ కాలంలో భారత్ మొత్తం వస్తువులు, సేవల ఎగుమతులు 568.84 బిలియన్ డాలర్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన 487.59 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది 16.66 శాతం వృద్ధి కావడం విశేషం. అక్టోబర్ 2026లో మొత్తం ఎగుమతులు 89.99 బిలియన్ డాలర్లకు చేరగా, గత ఏడాది అక్టోబర్‌లో నమోదైన 69.27 బిలియన్ డాలర్లతో పోలిస్తే 29.90 శాతం వృద్ధి నమోదైంది. వస్తువుల ఎగుమతులు ఏప్రిల్-అక్టోబర్ 2026-27లో 309.06 బిలియన్ డాలర్లకు చేరి 21.96 శాతం వృద్ధి సాధించాయి. పెట్రోలియం కాకుండా ఇతర ఉత్పత్తుల ఎగుమతులు 259.22 బిలియన్ డాలర్లుగా నమోదై 18.01 శాతం పెరిగాయి. అక్టోబర్‌లో ప్రధాన ఎగుమతి రంగాల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది. ప్రధానంగా పెట్రోలియం ఉత్పత్తులు 140.21 శాతం, ఎలక్ట్రానిక్ వస్తువులు 62.70 శాతం, రత్నాలు, ఆభరణాలు 40.06 శాతం, ఆర్గానిక్, ఇనార్గానిక్ కెమికల్స్ 36.20 శాతం, ఇంజినీరింగ్ వస్తువులు 36.01 శాతం వృద్ధి సాధించాయి. ఏప్రిల్-అక్టోబర్ కాలంలో సేవల ఎగుమతులు 259.78 బిలియన్ డాలర్లకు చేరగా, సేవల వాణిజ్య మిగులు 124.80 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అక్టోబర్‌లో భారత ఎగుమతులకు ప్రధానంగా అమెరికా, స్పెయిన్, సింగపూర్, మలేషియా, చైనా మార్కెట్లు భారీగా తోడ్పడ్డాయి.





నిర్లక్ష్యం చేస్తే.. వేటే!

- శ్రీకాళహస్తి ఆలయ భద్రతా వైఫల్యాలపై మంత్రి ఆగ్రహం
- అదనపు లడ్డూ పోటులో అగ్నిప్రమాద ప్రాంతం పరిశీలన
- ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలి
- సురక్షిత ప్రసాదాల కోసం క్లౌడ్ కిచెన్ ఏర్పాటుకు ఆదేశం
- ఎన్నికల తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం

శ్రీకాళహస్తి, నవంబర్ 13 (సమయం న్యూస్): శ్రీకాళహస్తి ఆలయంలో భక్తుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యమైనా సహించేది లేదని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను హెచ్చరించారు. గురువారం ఆలయ అదనపు లడ్డూ పోటులో జరిగిన అగ్నిప్రమాద ప్రాంతాన్ని శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అగ్నిప్రమాదానికి దారితీసిన కారణాలు, అక్కడ తీసుకున్న భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యుత్ వైరింగ్, ఇతర పరికరాలతో పాటు అగ్నిమాపక వ్యవస్థలను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని ఆదేశించారు. వంటశాలలు, లడ్డూ తయారీ కేంద్రాల్లో భద్రత, పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలను మరింత పటిష్టం చేయాలని స్పష్టం చేశారు. భద్రతా లోపాలకు బాధ్యులుగా తేలిన వారిపై ఎన్నికల అనంతరం సమగ్ర సమీక్ష నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం వార్నింగ్ ఇచ్చారు.



ఆధునిక సాంకేతికతతో క్లౌడ్ కిచెన్..

భక్తులకు సురక్షిత వాతావరణంలో నాణ్యమైన ప్రసాదాలు అందించేందుకు ఆధునిక సాంకేతికతతో క్లౌడ్ కిచెన్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. ప్రతిరోజూ ఆలయాలకు వచ్చే వేలాది మంది భక్తుల భద్రతే దేవస్థాన అధికారుల ప్రథమ బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మెట్టు సాయికుమార్, ఈవో, పాలకమండలి సభ్యులు, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమరావతిలో.. ఖతార్ ఆఫీస్!

ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ప్రతిపాదన

పోర్టులు, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం

ఏపీకి పూర్తి సహకారం ఉంటుందన్న ఖతార్ రాయబారి

ఏపీలో పెట్టుబడి అవకాశాలపై త్వరలో బృందం పర్యటన

విశాఖపట్నం, నవంబర్ 13 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో పోర్టులు, పెట్రో కెమికల్ పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఖతార్ ప్రభుత్వాన్ని కోరారు. అమరావతిలో ఖతార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని భారత్‌లో ఖతార్ రాయబారి మహ్మద్ హసన్ అల్ జబీర్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఖతార్ రాయబారి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, లాజిస్టిక్స్ పార్కులు, హాస్పిటాలిటీ, వ్యవసాయం, ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఉన్న అపారమైన అవకాశాలను సీఎం ఆయనకు వివరించారు. ఖతార్ ఎయిర్‌వేస్ కనెక్టివిటీ పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రజెంటేషన్, ఆయన విజన్‌ను అల్ జబీర్ అభినందించారు. రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలను పరిశీలించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇందుకోసం త్వరలోనే ఖతార్ నుంచి ఒక అధికారిక ప్రతినిధి బృందం ఏపీలో పర్యటిస్తుందని రాయబారి వెల్లడించారు. ఇప్పటికే ముంబైలో 'విజిట్ ఖతార్' కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని, ఇతర రాష్ట్రాల్లోనూ ఇలాంటి కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

పారిశ్రామికవేత్తల్లో రాష్ట్ర ప్రభుత్వంపై పూర్తి విశ్వాసం

సీఎం నేతృత్వంలో సీఐఐ సదస్సు విజయవంతం

ముగింపు సదస్సులో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం

విశాఖలో తొమ్మిదోసారి సదస్సు నిర్వహణ అభినందనీయం

అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ఆంధ్రప్రదేశ్

యువతకు విస్తృతంగా లభించనున్న ఉపాధి అవకాశాలు



విశాఖపట్నం, నవంబర్ 13 (సమయం న్యూస్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, రాష్ట్ర ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తలు పూర్తి విశ్వాసం ఉంచారని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ప్రశంసించారు. విశాఖపట్నంలో రెండు రోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు కార్యక్రమంలో శుక్రవారం గవర్నర్ ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఈ భాగస్వామ్య సదస్సు పూర్తి విజయవంతమైందని, విశాఖలో ఈ సదస్సును తొమ్మిదోసారి నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో ఆసియా నుంచి ఆఫ్రికా వరకు వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొనడం విశేషమన్నారు. గడచిన రెండున్నరేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వచ్చాయని, ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలోని యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు, విశాఖ స్టీల్ ప్లాంట్, తూర్పు కోస్తా రైల్వే జోన్ లాంటి భారీ ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వ సహకారంతో సాకారం అయ్యాయని గవర్నర్ గుర్తుచేశారు. ఈ సందర్భంగా సీఐఐ భాగస్వామ్య సదస్సుకు విచ్చేసిన దేశ విదేశీ ప్రతినిధులకు, ప్రభుత్వ అధికారులకు, పారిశ్రామికవేత్తలకు గవర్నర్ నజీర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రాత్రి కోర్టులతో ప్రయోగాలు వద్దు!

- **ఏపీని కేంద్ర బీజేపీ ప్రయోగశాలగా మారుస్తుందా?**
- **న్యాయవ్యవస్థలో ముందుగా ఖాళీలను భర్తీ చేయాలి**
- **పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులతో సరికాదు**
- **రాత్రి కోర్టుల ప్రతిపాదనపై సీపీఐ నారాయణ ఫైర్**
- **సిబ్బంది లేకుండా న్యాయ ప్రక్రియ ఎలా వేగవంతం చేస్తారు?**



అమరావతి, నవంబర్ 13 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో రాత్రి కోర్టులు నిర్వహించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనపై సీపీఐ జాతీయ కార్యదర్శి కే. నారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి ప్రయోగశాలగా మారుస్తారా అని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించాలన్న లక్ష్యం మంచిదే అయినప్పటికీ, న్యాయవ్యవస్థలోని మౌలిక సమస్యలను పరిష్కరించకుండా కోర్టుల పనివేళలను పొడిగించడం, పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులతో రాత్రి కోర్టులు నిర్వహించడం ఏమాత్రం సరైన విధానం కాదన్నారు. అధికారిక గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 875 న్యాయమూర్తుల పోస్టులకు గాను 738 మంది మాత్రమే పనిచేస్తుండగా ఇంకా 137 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కోర్టు సిబ్బంది కొరత కూడా తీవ్రంగా ఉందని, 2022 నాటి హైకోర్టు నివేదిక ప్రకారం మంజూరైన 11,223 పోస్టుల్లో 4,367 పోస్టులు ఖాళీగా ఉన్నాయని గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రస్తుత తాజా గణాంకాలను ప్రజలకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూషన్ విభాగంలోనూ అసిస్టెంట్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇలా తగిన సంఖ్యలో సిబ్బంది లేకుండా న్యాయ ప్రక్రియను ఎలా వేగవంతం చేస్తారని నారాయణ నిలదీశారు.

ముందస్తు ప్రణాళిక ఏదీ..

న్యాయవ్యవస్థలో చేరినప్పుడే ప్రతి ఉద్యోగి పదవీ విరమణ తేదీ అధికారికంగా నమోదవుతుందని, ఎవరెప్పుడు పదవీ విరమణ చేస్తారో ప్రభుత్వానికి ముందే తెలుస్తుందని నారాయణ స్పష్టం చేశారు. ఆ ఖాళీలను ముందుగానే అంచనా వేసి నియామక ప్రక్రియను చేపట్టడం ప్రభుత్వ కనీస బాధ్యత అన్నారు. ఈ బాధ్యతను గాలికొదిలేసి ఉన్న సిబ్బందిపై అదనపు పనిభారం మోపడం, ప్రజలను రాత్రివేళల్లో కోర్టులకు రావాల్సిన పరిస్థితిలోకి నెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ పరిపాలనా వైఫల్యానికి ప్రజలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఏమాత్రం బాధ్యులు కారని తేల్చిచెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే కొత్త ప్రయోగాలు చేయడం మాని, ముందుగా న్యాయవ్యవస్థలోని ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి వ్యవస్థను బలోపేతం చేయాలని నారాయణ ప్రభుత్వాన్ని కోరారు.

ఫోన్ కాల్ దూరంలో ప్రభుత్వం!

- **పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చిన సీఎం చంద్రబాబు**
- **ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ ఎండీ శాశ్వత్ గోయెంకాతో భేటీ**
- **విశాఖ, తిరుపతికి ఐటీ కార్యకలాపాల విస్తరణపై చర్చ**
- **గ్రీన్ ఎనర్జీ, వస్త్ర పరిశ్రమల్లో పెట్టుబడులకు ఆహ్వానం**
- **సామాజిక బాధ్యతగా పీ4 కార్యక్రమంలో భాగస్వామ్యం**
- **ఏపీ సహకారం దేశానికే ఆదర్శమన్న శాశ్వత్ గోయెంకా**



విశాఖపట్నం, నవంబర్ 13 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ఒక ఫోన్ కాల్ దూరంలోనే అందుబాటులో ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా అనుమతులు మంజూరు చేసేలా అధికార యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ శాశ్వత్ గోయెంకా ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలు, సంస్థ కార్యకలాపాల విస్తరణపై వారు సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, ఐటీ సేవలు, క్రీడలు, వస్త్రాలు, ఫ్యాషన్ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని సీఎం వివరించారు. ఆర్‌పీఎస్‌జీ గ్రూప్‌కు చెందిన పుర్వా గ్రీన్ పవర్ ఇప్పటికే రాష్ట్రంలో 349.8 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు ద్వారా సుమారు 3,286 కోట్ల పెట్టుబడులు పెడుతున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. దీనికి అదనంగా సౌర విద్యుత్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లోనూ పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు.

విశాఖ, తిరుపతికి ఐటీ విస్తరణ..

ప్రస్తుతం విజయవాడలోని మేధా ఐటీ టవర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆర్‌పీఎస్‌జీ గ్రూప్‌కు చెందిన ఫస్ట్‌సోర్స్ సంస్థను విశాఖపట్నం, తిరుపతికి విస్తరించే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి కోరారు. పేద కుటుంబాలకు చేయూత అందించే లక్ష్యంతో ప్రభుత్వం సామాజిక బాధ్యతగా అమలు చేస్తున్న పీ4 కార్యక్రమంలో ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ కూడా భాగస్వామి కావాలని చంద్రబాబు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ ఎండీ శాశ్వత్ గోయెంకా మాట్లాడుతూ.. పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న సహకారం దేశంలో మరెక్కడా లేదని కొనియాడారు. ఈ విషయంలో ఏపీ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తోందని ప్రశంసించారు. సీఐఐ సదస్సులో పెట్టుబడి అవకాశాలపై చంద్రబాబు ఇచ్చిన ప్రజెంటేషన్ అద్భుతంగా ఉందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు తమ సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రికి గోయెంకా స్పష్టం చేశారు.

మళ్లీ కియా.. మరింత ఉపాధి!

- **కియా విస్తరణపై మంత్రి సవిత హర్షం**
- **కొత్తగా 12 వేల మందికి ఉద్యోగావకాశాలు**
- **మరింతగా మారనున్న పెనుకొండ రూపురేఖలు**
- **కూటమి ప్రభుత్వంపై పెట్టుబడిదారుల నమ్మకం**
- **లక్ష్యానికి మించి ఏపీకి పెట్టుబడుల వెల్లువ**
- **సీఎం, డిప్యూటీ సీఎంకు మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు**



అమరావతి, నవంబర్ 13 (సమయం న్యూస్): విశాఖపట్నం సీఐఐ సదస్సు వేదికగా కియా కార్ల పరిశ్రమ ప్లాంట్ విస్తరణకు కూటమి ప్రభుత్వంతో ఒప్పందం జరగడం పట్ల రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. కార్ల పరిశ్రమ విస్తరణతో పెనుకొండ పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందడమే కాకుండా.. కొత్తగా 12 వేల మందికి పైగా యువతకు ఉద్యోగావకాశాలు లభించనున్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. విశాఖలో జరుగుతున్న సీఐఐ సమ్మిట్ పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన రాబడుతోందని, కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వంపై ఉన్న పూర్తి నమ్మకంతో దేశ విదేశాలకు చెందిన దిగ్గజ సంస్థలు ఏపీలో పరిశ్రమల స్థాపనకు పోటీ పడుతున్నాయని ఆమె వెల్లడించారు. సదస్సు తొలిరోజు ఏకంగా 5.85 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, రెండో రోజు కూడా ప్రఖ్యాతి గాంచిన సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయని వివరించారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న 11 లక్షల కోట్ల లక్ష్యానికి మించి అదనంగా పెట్టుబడులు వస్తుండటం శుభపరిణామం అన్నారు.

సీఎస్ఆర్ నిధులతో మౌలిక వసతులు..

ముఖ్యంగా శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో ఇప్పటికే ఉన్న కియా కార్ల పరిశ్రమ విస్తరణకు ఆ సంస్థ యాజమాన్యం ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉందని మంత్రి సవిత తెలిపారు. ఏకంగా 17 వేల కోట్లతో రెండు లక్షల కార్ల ఉత్పత్తే లక్ష్యంగా యాజమాన్యం ఒప్పందం చేసుకుందని, దీంతో కొత్తగా 12 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కియా పరిశ్రమ ఏర్పాటు కావడంతో అప్పట్లోనే 13 వేల మందికి పైగా ఉద్యోగాలు లభించాయని ఆమె గుర్తుచేశారు. కియా పరిశ్రమ రాకతో పెనుకొండ రూపురేఖలే పూర్తిగా మారిపోయాయని, ఇప్పుడు ప్లాంట్ విస్తరణ పనులు కూడా ప్రారంభమైతే ఆ సంస్థ నుంచి సీఎస్ఆర్ నిధులు మరింతగా వచ్చే అవకాశం ఉందన్నారు. తద్వారా పెనుకొండ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎంతో వీలు కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కియా విస్తరణ పనులకు పచ్చజెండా ఊపిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, కార్ల పరిశ్రమ యాజమాన్యానికి మంత్రి సవిత ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

కివీస్ చేతిలో టీమిండియా చిత్తు

- 244 పరుగుల తేడాతో ఘోర పరాజయం
- 89 పరుగులకే కుప్పకూలిన భారత బ్యాటింగ్ లైనప్
- నిప్పులు చెరిగిన మాట్ హెన్రీ.. 27 పరుగులిచ్చి 6 వికెట్లు
- తొలి ఓవర్‌లోనే రోహిత్, కోహ్లీ, అయ్యర్ పెవిలియన్‌కు



మౌంట్ మౌంగనుయ్ (న్యూజిలాండ్), నవంబర్ 13 (సమయం న్యూస్): న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియాకు ఊహించని రీతిలో ఘోర పరాభవం ఎదురైంది. మౌంట్ మౌంగనుయ్ వేదికగా జరిగిన నాలుగో వన్డే మ్యాచ్‌లో ఆతిథ్య కివీస్ జట్టు 244 పరుగుల భారీ తేడాతో భారత్‌ను చిత్తుగా ఓడించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తిగా తేలిపోయిన రోహిత్ సేన, వన్డే క్రికెట్ చరిత్రలోనే తమ అత్యంత చెత్త ప్రదర్శనల్లో ఒకదానిని నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 333 పరుగుల భారీ స్కోరు సాధించగా.. అనంతరం 334 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన భారత్ కేవలం 89 పరుగులకే కుప్పకూలింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌కు ఓపెనర్ విల్ యంగ్ గట్టి పునాది వేశాడు. భారత బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయిస్తూ 125 పరుగులతో అద్భుతమైన శతకం బాదాడు. అతని మెరుపు సెంచరీకి తోడు మిగతా బ్యాటర్లు కూడా రాణించడంతో కివీస్ జట్టు 333 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచింది. మౌంట్ మౌంగనుయ్ పిచ్‌పై భారత్ ముందు 334 పరుగుల కష్టసాధ్యమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. భారీ లక్ష్య ఛేదనలో భారత జట్టుకు ఆరంభంలోనే కోలుకోలేని దెబ్బ తగిలింది. న్యూజిలాండ్ స్టార్ పేసర్ మాట్ హెన్రీ నిప్పులు చెరిగే బంతులతో భారత టాపార్డర్‌ను కకావికలం చేశాడు. తన స్పెల్ తొలి ఓవర్‌లోనే కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, మిడిలార్డర్ కీలక ఆటగాడు శ్రేయస్ అయ్యర్‌లను పెవిలియన్‌కు పంపి టీమిండియా వెన్నువిరిచాడు. ఆ ఆరంభ షాక్ నుంచి భారత జట్టు ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. హెన్రీ ధాటికి భారత బ్యాటర్లు క్రీజులో నిలవలేక ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్ బాట పట్టారు. అద్భుత బౌలింగ్‌తో భారత్ పతనాన్ని శాసించిన మాట్ హెన్రీ కేవలం 27 పరుగులు మాత్రమే ఇచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. ఫలితంగా టీమిండియా కనీసం 100 పరుగుల మార్కును కూడా దాటలేక 89 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ భారీ పరాజయంతో వన్డే క్రికెట్ చరిత్రలో పరుగుల పరంగా భారత్ ఎదుర్కొన్న అతిపెద్ద ఓటముల జాబితాలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. 2000 సంవత్సరంలో షార్జా వేదికగా శ్రీలంక చేతిలో 245 పరుగుల తేడాతో ఓడిపోవడం ఇప్పటికీ భారత్‌కు అత్యంత భారీ ఓటమిగా మొదటి స్థానంలో కొనసాగుతోంది. తాజాగా 2026లో న్యూజిలాండ్ చేతిలో ఎదురైన ఈ 244 పరుగుల పరాజయంతో టీమిండియా ఈ జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. కేవలం ఒక్క పరుగు తేడాతో తమ 26 ఏళ్ల నాటి అత్యంత చెత్త రికార్డును అధిగమించే ప్రమాదం నుంచి భారత్ తృటిలో తప్పించుకుంది.



అంబేకర్, గుంజన్ స్వర్ణ చరిత్ర

యూత్ ఒలింపిక్స్ బాక్సింగ్ గోల్డెన్ పంచ్‌లు

డాకర్ (సెనెగల్), నవంబర్ 13 (సమయం న్యూస్): ప్రతిష్టాత్మక యూత్ ఒలింపిక్స్‌లో భారత యువ బాక్సర్లు అంబేకర్ మీతేయి, గుంజన్ సరికొత్త చరిత్ర సృష్టించారు. ఈ గేమ్స్ చరిత్రలో దేశానికి స్వర్ణ పతకాలు అందించిన బాక్సర్లుగా రికార్డుకెక్కారు. గురువారం జరిగిన ఫైనల్స్‌లో ఈ ఇద్దరూ గోల్డెన్ పంచ్‌లు విసిరారు. తొలుత పురుషుల 50 కేజీల తుదిపోరులోఅంబేకర్ 3-2తో ఐర్లాండ్ బాక్సర్ క్రిస్టియన్ జుబానిపై ఉత్కంఠ విజయం సాధించి యూత్ ఒలింపిక్ చాంపియన్ గా నిలిచాడు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో జుబాని నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనప్పటికీ ఒత్తిడికి తడబడకుండా పోరాడిన అంబేకర్ విజయం సొంతం చేసుకున్నాడు. యూత్ ఒలింపిక్స్ బాక్సింగ్‌లో శివ థాపా 2010 ఎడిషన్‌లో (60 కేజీల విభాగం) సాధించిన రజత పతకమే భారత్‌కు అత్యుత్తమ ప్రదర్శన కాగా.. ఇన్నేండ్లకు అంబేకర్ ఆ రికార్డులను బద్దలు కొట్టాడు. అనంతరం మహిళల 48 కేజీల విభాగంలో ఫైనల్లో అసాధారణ ప్రదర్శన చేసిన గుంజన్ 5-0తో బెన్సలా బుథియానా (అల్జీరియా)ను చిత్తు చేసింది. మూడు రౌండ్లలోనూ స్పష్టమైన పంచ్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసి పసిడి సొంతం చేసుకుంది.

ఖవాజాను బలిపశువును చేశారు

- కమిన్స్‌పై వార్నర్ సంచలన ఆరోపణలు!
- ఆస్ట్రేలియా క్రికెట్‌లో మళ్లీ బాల్ ట్యాంపరింగ్ వివాదం
- ఎనిమిదేళ్ల నాటి శాండ్‌పేపర్ ఉదంతంపై మాటల యుద్ధం



పెర్త్ (ఆస్ట్రేలియా), నవంబర్ 13 (సమయం న్యూస్): ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన ఎనిమిదేళ్ల నాటి బాల్ ట్యాంపరింగ్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. 2018లో జరిగిన శాండ్‌పేపర్ ఉదంతంపై ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ చేసిన వ్యాఖ్యలను మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ తీవ్రంగా తప్పుబట్టాడు. నిజాలు వెల్లడిస్తున్న ఉస్మాన్ ఖవాజాను కమిన్స్ బలిపశువును చేశాడంటూ సంచలన ఆరోపణలు చేశాడు. దీంతో ఆస్ట్రేలియా క్రికెట్‌లో పాత వివాదం కొత్త చర్చకు దారితీసింది. ఉస్మాన్ ఖవాజా రాసిన 'సబ్' ఆత్మకథ ఈ వివాదానికి కారణమైంది. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన కేప్‌టౌన్ టెస్టులో బంతిని శాండ్‌పేపర్‌తో రుద్దే విషయం జట్టులోని అందరికీ తెలుసని ఖవాజా తన పుస్తకంలో పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్యలను కమిన్స్ తీవ్రంగా ఖండించాడు. శాండ్‌పేపర్ వినియోగం గురించి తనకు ఎలాంటి సమాచారం లేదని, అందరికీ తెలుసనడం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశాడు. ఈ నేపథ్యంలో పెర్త్‌లో ఓ క్రీడా ప్రసార సంస్థతో మాట్లాడిన వార్నర్ ఖవాజాకు అండగా నిలిచాడు. ఖవాజా తన పుస్తకంలో రాసిన విషయాలు నిజమేనని, అతడిని కమిన్స్ తప్పుబట్టడం బాధాకరమని పేర్కొన్నాడు. అప్పట్లో జరిగిన విచారణ కూడా లోపభూయిష్టంగా సాగిందని విమర్శించాడు. మరోవైపు సిడ్నీలో మీడియాతో మాట్లాడిన కమిన్స్ తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చాడు. బాల్ ట్యాంపరింగ్ కుట్రలో తన ప్రమేయం లేదని, ఎనిమిదేళ్లుగా ఇదే విషయాన్ని చెబుతున్నానని స్పష్టం చేశాడు. 2018 మార్చిలో కేప్‌టౌన్ టెస్టు సందర్భంగా ఆస్ట్రేలియా ఆటగాడు కామెరూన్ బెన్‌క్రాఫ్ట్ శాండ్‌పేపర్‌తో బంతిని రుద్దుతూ కెమెరాలకు చిక్కాడు. ఈ ఘటనపై క్రికెట్ ఆస్ట్రేలియా విచారణ జరిపి అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌లపై ఏడాది పాటు, బెన్‌క్రాఫ్ట్‌పై తొమ్మిది నెలల పాటు నిషేధం విధించింది. తాజాగా ఖవాజా ఆత్మకథతో ఆ వివాదం మళ్లీ రాజుకోవడంతో వార్నర్, కమిన్స్ మధ్య మాటల యుద్ధం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.




తెలుగు బ్లాక్‌హాక్స్ విజయం

హైదరాబాద్, , నవంబర్ 13 (సమయం న్యూస్): ప్రైమ్ వాలీబాల్ లీగ్ తెలుగు బ్లాక్‌హాక్స్ జట్టు తెలుగు స్వాగ్ ట్రోఫీలో విజేతగా నిలిచింది. కంకణాల స్పోర్ట్స్ గ్రూప్ (కేఎస్ జీ)ఆధ్వర్యంలో విజయవాడలో గురువారం జరిగిన తుదిపోరులో ఆ జట్టు 5-0తేడాతో బ్లాక్‌హాక్స్ అకాడమీపై ఘనవిజయం సాధించింది. శాప్ వీసీ ఎండీ ఎస్. భరణితో కలిసి కేఎస్‌జీ చైర్మన్ కె. అభిషేక్‌రెడ్డి విజేతకు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని వాలీబాల్ ప్రతిభను వెలికితీసి, యువ క్రీడాకారులకు ఉన్నత స్థాయి అవకాశాలు కల్పించడమే తమ తెలుగు బ్లాక్‌హాక్స్ ఫ్రాంచైజీ ప్రధాన లక్ష్యమని తెలిపాడు. ఆగస్టులో నిర్వహించిన ట్రయల్స్ ద్వారా సిరిల్ రెడ్డి (వరంగల్), విష్ణువర్ధన్ బాబు (యానం), నమిత్, మనీష్ వెంకటేశన్, దీపక్ పీవీఎల్ ఐదో సీజన్ తెలుగు బ్లాక్‌హాక్స్ జట్టులో చోటు సంపాదించారని, మరో 12 మంది ప్రతిభావంతులను తమ అకాడమీ జట్టుకు ఎంపిక చేశామని తెలిపారు.

రోహిత్, ఇషాన్ తప్పిదాలు

- ఐదు పరుగుల నుంచి 125 రన్స్‌కు విల్ యంగ్!
- ఆరంభంలోనే రెండు సులభమైన క్యాచ్‌లు వదిలేసిన భారత్



ఓవెల్, నవంబర్ 13 (సమయం న్యూస్): భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఓవెల్ వేదికగా జరుగుతున్న నాలుగో వన్డే మ్యాచ్‌లో కివీస్ బ్యాటర్ విల్ యంగ్ అద్భుత సెంచరీతో మెరిశాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు యంగ్ భారీ స్కోరు అందించాడు. 108 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్సర్లతో మొత్తం 125 పరుగులు చేశాడు. అయితే అతడు సాధించిన ఈ సెంచరీ వెనుక టీమిండియా ఫీల్డర్ల తప్పిదాలు కీలకంగా నిలిచాయి. ముఖ్యంగా రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్ ఇచ్చిన రెండు క్యాచ్ అవకాశాలను యంగ్ సద్వినియోగం చేసుకుని శతకం బాదాడు. ఇన్నింగ్స్ ఆరంభంలోనే విల్ యంగ్‌కు ఊహించని రీతిలో రెండు జీవనదానాలు లభించాయి. అతడు వ్యక్తిగత స్కోరు ఐదు పరుగుల వద్ద ఉన్నప్పుడు భారత బౌలర్ జెకిబ్ నబీ వేసిన రెండో ఓవర్ ఐదవ బంతికి తొలి లైఫ్ దక్కింది. స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న రోహిత్ శర్మ సులభమైన క్యాచ్‌ను జారవిడిచాడు. ఆ తర్వాతి బంతికే మరోసారి యంగ్ జెటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. యంగ్ బ్యాట్‌ను తాకిన బంతి వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ వైపు వెళ్లగా.. ఇషాన్ కూడా ఆ క్యాచ్‌ను అందుకోలేకపోయాడు.

భారత్‌ను దెబ్బతీసిన తప్పిదాలు

వరుస బంతుల్లో లభించిన ఈ రెండు అవకాశాలు న్యూజిలాండ్ బ్యాటర్‌కు పూర్తిగా కలిసొచ్చాయి. ఐదు పరుగుల వద్దే పెవిలియన్‌కు చేరాల్సిన విల్ యంగ్.. ఆ లైఫ్‌లను ఉపయోగించుకుని భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. క్రీజులో కుదురుకున్న తర్వాత బౌండరీలతో పరుగుల వేగాన్ని పెంచాడు. ఈ క్రమంలో 88 బంతుల్లోనే 11 ఫోర్లు, మూడు సిక్సర్ల సాయంతో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. భారత్‌పై అతడికిదే తొలి వన్డే సెంచరీ కాగా.. అంతర్జాతీయ వన్డే కెరీర్‌లో ఐదో శతకం కావడం విశేషం. సెంచరీ తర్వాత కూడా దూకుడు కొనసాగించిన యంగ్, చివరకు 37వ ఓవర్లో నమన్ ధీర్ బౌలింగ్‌లో సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ కుమార్ కుశాగ్రకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఒకవేళ ఆరంభంలో రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్‌లలో ఎవరో ఒకరు ఆ క్యాచ్ పట్టి ఉంటే విల్ యంగ్ ఇన్నింగ్స్ ఐదు పరుగులకే ముగిసేది. కానీ రెండు అవకాశాలు చేజారడంతో అతడు ఏకంగా 125 పరుగులు సాధించి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కీలక సమయంలో క్యాచ్‌లు వదిలేయడం టీమిండియాకు ఎంతటి నష్టాన్ని కలిగిస్తుందో ఈ ఇన్నింగ్స్ మరోసారి రుజువు చేసింది.



క్వార్టర్స్‌లో శ్రీకాంత్, లక్ష్య

కుమమోటో: జపాన్ మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు కిదాంబి శ్రీకాంత్, లక్ష్యసేన్ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్ లో మాజీ నంబర్ వన్ శ్రీకాంత్ 21-15, 11-21, 21-18తో ఐదో సీడ్, 8వ ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్)కు షాకిచ్చిచ్చాడు. మరో మ్యాచ్ లో ఎనిమిదో సీడ్ లక్ష్యసేన్ 21-8, 21-14తో డోంగ్ టియాన్ (చైనా)ను ఓడించి ముందంజ వేశాడు. కానీ మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి- ట్రీసా జాలీ 14-21, 14-21తో మూడో సీడ్ ఇవనగా-నకనిషి (జపాన్) చేతిలోఓడిపోయింది.



ప్రెగ్నెంట్ అయితేనేంటి?

సినిమాలకు గుడ్ బై చెప్పేది లేదు..

కియారా అద్వానీ సంచలన వ్యాఖ్యలు!

ముంబై, నవంబర్ 13 (సమయం న్యూస్): మాతృత్వం కారణంగా సినిమాలకు దూరమవుతానని భావించడం సరికాదని బాలీవుడ్ నటి కియారా అద్వానీ స్పష్టం చేశారు. కుటుంబ జీవితంలో స్థిరపడేందుకు నటనకు గుడ్‌బై చెప్పబోతున్నారంటూ వస్తున్న ఊహాగానాలను ఆమె తోసిపుచ్చారు. తనకు నచ్చిన సినిమాలు, పాత్రలను ఎంచుకునే స్వేచ్ఛ తనకుందని, వ్యక్తిగత జీవితంతోపాటు సినీ ప్రయాణాన్ని కూడా కొనసాగిస్తానని వెల్లడించారు. భర్త సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి కరణ్ జోహర్ నిర్వహించే 'కాఫీ విత్ కరణ్' తొమ్మిదో సీజన్‌లో పాల్గొన్న సందర్భంగా కియారా తన వ్యక్తిగత జీవితం, సినీ కెరీర్‌పై మాట్లాడినట్లు కథనాలు వెలువడ్డాయి. రెండోసారి గర్భవతి అంటూ జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తన కలలను సాకారం చేసుకునే విషయంలో వెనక్కి తగ్గబోనని, మాతృత్వం నటనా జీవితానికి అడ్డంకి కాదని ఆమె పేర్కొన్నట్లు సమాచారం. మరోవైపు 'టాక్సిక్' చిత్రం వైఫల్యం తనను తీవ్రంగా బాధించిందని కియారా చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సినిమాలోని సన్నిహిత సన్నివేశాలపై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన విమర్శలు తనను కుంగదీశాయని, ఆ కష్టకాలంలో సిద్ధార్థ్ మల్హోత్రా తనకు అండగా నిలిచారని వెల్లడించినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. 'లస్ట్ స్టోరీస్'లో తన నటనను చూసిన తర్వాత సిద్ధార్థ్ తనపై ఆసక్తి పెంచుకున్న విషయాన్ని కూడా ఆమె గుర్తుచేసుకున్నట్లు సమాచారం. వివాహం, మాతృత్వం కారణంగా నటీమణులు తమ వృత్తిని వదులుకోవాల్సిన అవసరం లేదనే అభిప్రాయాన్ని కియారా వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. తన భవిష్యత్తు నిర్ణయాలను తానే తీసుకుంటానని, సినిమాల్లో నటించడం కొనసాగిస్తానని స్పష్టం చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

దాదా ధమాకా.. దద్దరిల్లిపోతోంది ఇలాకా!

'స్టేట్ అంతా అదిరిపోద్ది.. నిదరంతా చెదిరిపోద్ది' అంటూ బాలయ్య మాస్ రచ్చ




హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): నటసింహం నందమూరి బాలకృష్ణ మరోసారి తనదైన మాస్ మేనియాతో అభిమానులను ఉర్రూతలూగిస్తున్నారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రం 'దాదా' నుంచి విడుదలైన తొలి గీతం 'దాదా ధమాకా' సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది. 'స్టేట్ అంతా అదిరిపోద్ది.. నిదరంతా చెదిరిపోద్ది' అంటూ సాగే ఈ పాటకు సంగీత దర్శకుడు ఎస్.థమన్ అందించిన ఊరమాస్ బాణీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బాలయ్య ఎనర్జీ, మాస్ స్టెప్పులు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వృద్ధి సినిమాస్ పతాకంపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలకృష్ణ సరసన కాజల్ అగర్వాల్ నటిస్తుండగా, మంచు మనోజ్ ప్రతినాయకుడిగా కనిపించనున్నాడు. ప్రత్యేక గీతంలో బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ తన అందాలు, నృత్యాలతో ఆకట్టుకుంటోంది. రామజోగయ్యశాస్త్రి అందించిన సాహిత్యానికి థమన్ సంగీతం తోడవగా, బాలకృష్ణ స్వయంగా పాటకు గొంతు కలపడం మరో విశేషం. ఆయన గంభీరమైన గాత్రం పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ రూపొందించిన మాస్ స్టెప్పులతో బాలయ్య తనదైన శైలిలో అదరగొట్టారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, గ్లింప్స్ సినిమాపై అంచనాలు పెంచగా, తాజాగా వచ్చిన పాట మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఈ పాటతో అభిమానులు రూపొందిస్తున్న చిన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి. మరోవైపు బాలకృష్ణకు ప్రమాదం జరగడంతో కొంతకాలం నిలిచిపోయిన చిత్రీకరణ ఇటీవల తిరిగి ప్రారంభమైంది. ప్రస్తుతం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా సినిమాను విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. 'వీరసింహారెడ్డి' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కలయికలో వస్తున్న 'దాదా' ప్రేక్షకులను ఎంతవరకు మెప్పిస్తుందో చూడాలి.

'పిచ్చి ప్రేమలో' ముంచేసిన నితిన్..
మనసు దోచే మెలోడీ!

'అలియాస్ రుక్మిణి' నుంచి రెండో గీతం విడుదల ■ డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం

హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): యువ కథానాయకుడు నితిన్ నటిస్తున్న తాజా చిత్రం 'అలియాస్ రుక్మిణి' నుంచి మరో మధురమైన ప్రేమగీతం ప్రేక్షకుల ముందుకొచ్చింది. నేచురల్ స్టార్ నాని సమర్పణలో యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై దీప్తి గంట నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేమ, వినోదం కలగలిసిన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన 'రుక్మిణి' పాటకు మంచి స్పందన లభించగా, తాజాగా రెండో గీతం 'పిచ్చి ప్రేమలో'ను చిత్రబృందం విడుదల చేసింది. సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ స్వరపరిచిన ఈ పాట మధురమైన బాణీలతో ఆకట్టుకుంటోంది. గాయకుడు కార్తీక్ తన గాత్రంతో పాటకు ప్రాణం పోయగా, గీత రచయిత కృష్ణకాంత్ భార్యపై భర్తకున్న ప్రేమను అందమైన పదాలతో ఆవిష్కరించారు. భార్య అల్లరి, అలకలు, చిన్నచిన్న సరదాలను ప్రేమగా ఆస్వాదించే భర్త మనోభావాలను ఈ గీతంలో చూపించారు. ఈశ్వర్ పెంటి రూపొందించిన నృత్యరీతులు పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ముఖ్యంగా కొత్తగా పెళ్లయిన దంపతుల మధ్య ఉండే ప్రేమానురాగాలను సహజంగా చిత్రీకరించారు. భార్యాభర్తలు కలిసి బయటకు వెళ్లడం, భర్త తన భార్యను పాఠశాల వద్ద దింపడం వంటి సన్నివేశాలు మధ్యతరగతి కుటుంబ జీవితాన్ని ప్రతిబింబిస్తున్నాయి. సాధారణ మధ్యతరగతి భర్త పాత్రలో నితిన్ సహజంగా కనిపించగా, సంప్రదాయ దుస్తుల్లో ఆఫియా సయ్యద్ ఆకట్టుకున్నారు. వీరిద్దరి మధ్య ప్రేమ సన్నివేశాలు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి జోమోన్ టి.జాన్ ఛాయాగ్రహణం, అవినాష్ కొల్లా నిర్మాణ రూపకల్పన, సృజన ఆదుసుమిల్లి కూర్పు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రచార చిత్రాలు, పాటలతో ఆసక్తి రేకెత్తిస్తున్న 'అలియాస్ రుక్మిణి' డిసెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది.



లాయర్‌గా కీర్తి సురేశ్!

ఆసక్తి రేపుతున్న 'సత్యవాన్ సావిత్రి' ట్రైలర్

వినోదం, కోర్టు డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం

హైదరాబాద్, నవంబర్ 13 (సమయం న్యూస్): జాతీయ ఉత్తమ నటి కీర్తి సురేశ్ మరో విభిన్న పాత్రతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సత్యవాన్ సావిత్రి'. ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వంలో వినోదం, కోర్టు డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఇందులో కీర్తి సురేశ్ న్యాయవాదిగా కనిపిస్తూ ఆసక్తి రేకెత్తిస్తున్నారు. బలవంతపు వివాహంతో ఒక్కటైన దంపతుల జీవితంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకోవడం, భర్త హత్య కేసులో చిక్కుకోవడం కథలో కీలక మలుపులుగా కనిపిస్తున్నాయి. తనకు ఇష్టం లేకుండా పెళ్లి జరిగినప్పటికీ హత్య కేసులో చిక్కుకున్న భర్తను రక్షించేందుకు భార్య న్యాయవాదిగా ఎలాంటి పోరాటం చేసింది? అసలు ఆ హత్య వెనుక ఉన్న నిజాలేమిటి? అనే అంశాల చుట్టూ కథ సాగనుంది. వినోదంతోపాటు ఉత్కంఠభరితమైన న్యాయస్థాన సన్నివేశాలకు ప్రాధాన్యమిస్తూ ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇప్పటివరకు విభిన్న పాత్రలతో మెప్పించిన కీర్తి సురేశ్ న్యాయవాదిగా ఎలాంటి నటన కనబరుస్తారనే ఆసక్తి నెలకొంది. నవంబర్ 20న 'సత్యవాన్ సావిత్రి' ప్రేక్షకుల ముందుకు రానుంది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**